# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :112 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 26-06-2024 | పేజీలు:4 వెల: 2.00


## శంషాబాద్ లో మళ్లీ చిరుత కలకలం

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాన్సీమియాగూడలో రెండు రోజుల క్రితం చిరుత కనిపించడంతో పట్టుకునేందకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం చిరుత సంచరించిదని అనవాళ్లు కనిపించడంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్‌లో కనిపించిన జంతువు చిరుతగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ట్రాప్ కెమెరాలో చిరుత కనిపించడంతో 3 బోన్లు, 10 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక బోన్‌లో చిరుత కోసం కుక్కను ఎరగా అధికారులు పెట్టారు. చిరుత పులి సంచరించడంతో శంషాబాద్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. నెల రోజుల క్రితం శంషాబాద్‌లోని విమానాశ్రయ ప్రాంతంలో చిరుతో పాటు రెండు పిల్లలను అటవీ శాఖ అధికారులు బంధించిన

## డ్రగ్స్ విషప్రయోగంతో సమానం




హైదరాబాద్,జూన్25: రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరి స్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ఏ స్థాయిలో అయినా నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం విషప్రయోగం లాంటిది.. ఇది అత్యంత ప్రమాదకరం. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. తెలిసీ తెలియని వయసులో వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

కొందరు కావాలనే తమ అక్రమ సంపాదన కోసం యువతకు డ్రగ్స్ అంటగడుతున్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు దేశద్రోహులు చేస్తున్న ప్రయత్నంగానూ దీన్ని చూడొచ్చని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మనపైనే ఉంది. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తాం. వాటి వినియోగం, రవాణా లేకుండా చేయాల్సిన బాధ్యత ఆ అధికారులదే. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి కూడా సహకారం అందాలి. డ్రగ్స్ సరఫరా చేసేవారు ఎక్కడున్నా అరెస్ట్ చేసే శక్తి సామర్థ్యాలు పోలీసు వ్యవస్థకు ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇచ్చే వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు వేయాలి. కొత్త వ్యక్తులపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలి. తాత్కాలిక సంతోషాలకు విద్యార్థులు బలి కావొద్దు. వారు అడ్డదారులు తొక్కితే కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధపడాల్సి ఉంటుందని భట్టి విక్రమార్క అన్నారు. కార్యక్రమంలో సిఎస్ శాంతికుమారి, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఎకు షాక్ ఇచ్చిన ఇండియా కూటమి

న్యూఢిల్లీ,జూన్25: దేశ చరిత్రలో తొలిసారి స్పీకర్ ఎన్నికకు పోటీ జరుగుతోంది. అధికార ఎన్‌డిఎ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి సై అంటోంది. లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్డీయే అభ్యర్థిగా ఓం బిర్లా ఏకగ్రీవం అవుతారని భావించిన బీజేపీ, ఎన్డీయే కూటమికి విపక్ష కాంగ్రెస్ భారీ షాక్ ఇచ్చింది. సంఖ్యా బలం తక్కువున్నా.. కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలిపింది. ఈ మేరకు కేరళ నుంచి 8సార్లు ఎంపీగా గెలుపొందిన కొడికున్నిల్ సురేష్‌ను ఇండియా కూటమి నుంచి స్పీకర్ అభ్యర్థిగా ప్రకటిస్తూ కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయన మంగళవారం తన నామినేషన్ దాఖలు చేశారు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి అప్పగించాలన్న సంప్రదాయాన్ని బీజేపీ తుంగలో తొక్కుతోందని రాహుల్ ఆరోపించారు. ఇకపోతే సీనియార్టీ ప్రకారం సురేశ్ ప్రోటెం స్పీకర్ కావాల్సి ఉన్నా, అధికార ఎన్‌డిఎ కూటమి ఒడిషాకు చెందిన మరో సీనియర్ భర్తృహరిని ఎంపిక చేసింది. ఈ నిర్ణయంపై ఇండియా కూటమి ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలో కనీసం డప్యూటి స్పీకర్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ కోరుతోంది. డిప్యూటి పదవిని తమకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే సయోధ్య కుదరకపోవడంతో దేశ చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఇప్పటికి వరకు జరిగిన లోక్‌సభ స్పీకర్ పదవులన్నీ ఏకగ్రీవం అయ్యాయి. కాగా 75 ఏళ్ళ దేశ చరిత్రలో లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగడం ఇదే తొలిసారి కానుంది. తొలుత స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం అవుతుందని భావించారు. కానీ స్పీకర్ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ మెలిక పెట్టింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇండియా కూటమి సభ్యులతో జరిపిన చర్చల్లో.. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు ఇస్తే స్పీకర్‌కి మద్దతు తెలుపుతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దీంతో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చేందుకు ఎన్డీయే కూటమి దాదాపు అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, కాంగ్రెస్ అనూహ్యంగా అభ్యర్థిని పోటీలో నిలిపింది. దీంతో స్పీకర్ పదవికి



తొలిసారి పోటీ జరుగబోతున్నది. తొలిసారి ప్రతపక్ష అభ్యర్థిగా కొండికునాల్ సురేశ్ పోటీపడుతున్నారు. కాగా ఎన్ డిఏ అభ్యర్థిగా ఓమ్ బిర్లా పోటీపడుతున్నారు. నామినేషన్ల పక్రియ మధ్యాహ్నం 12.00 గంటలకు ముగిసింది. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తో మోడీ నేతృత్వంలోని ఎన్ డిఏ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ విషయంలో ఓ అంగీకారానికి రాలేకపోయింది. దాంతో స్పీకర్ పదవికి పోటీ నెలకొంది. 18వ లోక్ సభ తొలి రోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ సహా 262 మంది కొత్తగా ఎన్నికయిన ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా మిగతా 281 మంది కొత్త ఎంపీలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసారు. వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగనున్నది. ఇదిలావుండగా ఇండియా బ్లాక్ కు చెందిన ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న నినాదాలతో, రాజ్యాంగం ప్రతులను పట్టుకుని నిరసన తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ జూన్ 27 న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే పక్రియ కొనసాగనున్నది. వచ్చే వారం ఉభయ సభలలో ప్రధాని మోడీ చర్చలపై సమాధానాలు ఇవ్వనున్నారు.

## ఎమ్మెల్యే సంజయ్ చేరికతో పార్టీలో చిచ్చు

జగిత్యాల,జూన్25: కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంపై ఇప్పటికే అసహనంతో ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి పల్లెలన్నీ తిరుగుతానని వెల్లడించారు. ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. అయితే పార్టీ మారే ఆలోచన ఇప్పటివరకు అయితే లేదని పేర్కొన్నారు. అలాగే ఏ పార్టీ నుంచి కూడా ఆహ్వానం లేదన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వచ్చి మాట్లాడారని జీవన్ రెడ్డి తెలిపారు. తనతో కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ దీపదాస్ మున్షీ కూడా మాట్లాడారని పేర్కొన్నారు. బీజేపీ నుంచి ఎవరూ తనను సంప్రదించలేదని స్పష్టం చేశారు. ఏ పార్టీ నుంచి తనకు కాల్స్ రాలేదని తెలిపారు. ఈ స్టేజ్‌లో పార్టీ నుంచి గౌరవం కోరుకున్నా.. కానీ ఈ రోజు తనకు ఆ గౌరవం దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లు పార్టీ ప్రతి నిర్ణయాన్ని పాటించానని తెలిపారు . నష్టం కలిగినా పార్టీ ఎక్కడ పోటీ చేయాలన్నా చేశానని పేర్కొన్నారు. తన ప్రమేయం లేకుండానే జరగాల్సింది జరిగిందని చెప్పారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సోమవారం శ్రీధర్ బాబు కలిసి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కానీ ఆయన లొంగలేదు. '200 కోట్ల రూపాయల నిధులు ఇచ్చి కండువా కప్పడం అవసరమా? ఇప్పుడు ప్రభుత్వానికి ఏమైంది? నా సీనియారిటి, సిన్సియార్టీకి ఇచ్చే విలువ ఇదేనా? కార్యకర్తల కష్టాలు, మనోభావాలు అక్కర్లేదా?' అంటూ మంత్రి శ్రీధర్‌బాబు ఎదుట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంపై కినుక వహించిన జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తన ఇంటికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుపై జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు రెండుసార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడండి అంటూ జీవన్‌రెడ్డిని కోరినా, 'మాట్లాడను' అంటూ తిరస్కరించినట్టు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ ఫోన్ చేశారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా కోరినట్లు సమాచారం. హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుతామని మున్షీ చెప్పినట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో మరోసారి జీవన్ రెడ్డితో ఆయన మాట్లాడారు. రాజీనామా ఆలోచనను విరమించుకోవాలని జీవన్ రెడ్డిని లక్ష్మణ్ కోరారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న తనను మాటమాత్రంగానైనా సంప్రదించకుండా తన సొంత నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఇది తనను అగౌరవపరిచినట్లేనని ఆయన



ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జగిత్యాల కాంగ్రెస్ నాయకులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వందలాది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు సైతం సోమవారం ఉదయమే జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. రాత్రి వరకూ అక్కడే ఉండి జీవన్‌రెడ్డి ఆవేదనలో పాలుపంచుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరిద్దరు సీనియర్ నేతలు పార్టీకి రాజీనామా చేస్తూ టీపీసీసీ అధ్యక్షుడికి లేఖలు పంపించినట్లు ప్రకటించారు. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టి జీవన్‌రెడ్డిని సముదాయించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. సోమవారం మధ్యాహ్నం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్, మరో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ జీవన్‌రెడ్డిని కలిసి ఆయనకు నచ్చజెపుతూ తొందరపాటు నిర్ణయం ఏదీ తీసుకోవద్దని కోరినట్లు తెలిసింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన పార్టీ అధినాయకత్వం మంత్రి శ్రీధర్‌బాబును దూతగా పంపగా ఆయన చర్చలు జరిపారు. జీవన్‌రెడ్డి మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటామని, ఆయనకు ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గకుండా పార్టీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గతంలో మాదిరిగానే ఆయన పార్టీకి పెద్ద దిక్కుగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ సంఘటన కారణంగా మనస్తాపానికి గురైనట్లు జీవన్‌రెడ్డి వివరించారని, అన్ని విషయాలను అధిష్ఠానానికి తెలియజేస్తానని తెలిపారు. అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జరిగిన పరిణామాలపై శ్రీధర్‌బాబుతో చర్చించానన్నారు. కాంగ్రెస్ అభ్యున్నతి కోసం కృషి చేసిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కార్యకర్తల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత పార్టీపై ఉందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీ నిబంధనల్ని పాటిస్తానని, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేసిన జీవన్‌రెడ్డి పరాజయం పాలయ్యారు. ఆయన్ను గెలిస్తే నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లోనూ జోక్యం చేసుకుంటారన్న ఉద్దేశంతో అక్కడి నాయకులు ఆయనకు సహకరించలేదన్న ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న నాయకుడికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో సాన్నిహిత్యం ఉంది.

## తడిబట్టలతోనే పాడి కౌశిక్ రెడ్డి ప్రమాణం..



హైదరాబాద్,మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాలు విసిరారు. ముందుగా తాను ఎలాంటి అవినీతి చేయలేదని తడి బట్టలతో దేవుడి ఫొటో ముందు పాడి కౌశిక్ రెడ్డి ప్రమాణం చేశారు. తాను ఎక్కడా ఒక్క అవినీతి చేయలేదని.. ఆ అవసరం కూడా తనకు లేదని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాలు విసిరారు. రేపు మధ్యాహ్నం 12 గంటలకు అపోలో వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చి తన నిజాయతీని నిరూపించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కౌశిక్ రెడ్డి సవాలు విసిరారు. ఫ్లైయాష్ తరలింపు, ఓవర్‌లోడ్ లారీల నుంచి డబ్బులు తీసుకోలేదని దేవుడి మీద ప్రమాణం చేయాలన్నారు. ఒకవేళ నువ్వు రాకపోతే అన్ని స్కామ్‌లు ఉన్నాయని, అక్రమంగా వేల కోట్ల రూపాయలు దోచుకున్నానని ఒప్పుకున్నట్లేనని స్పష్టం చేశారు. మంత్రి పొన్నంపై పాడి కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఇటీవల ప్రభాకర్ కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబు స్పందించారు. కౌశిక్ రెడ్డి ఎలాంటి అవినీతి చేయకపోతే చెల్పూరు హనుమాన్ టెంపుల్‌కు వచ్చి ప్రమాణం చేయాలని సవాలు విసిరారు. ఈ సవాలును స్వీకరించిన కౌశిక్ రెడ్డి ఇవాళ చిల్పూరు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. దీంతో అప్రమత్తమైన కౌశిక్ రెడ్డిని వీణవంకలోనే పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు. ఈ వీణవంకలోని తన ఇంట్లోనే కౌశిక్ రెడ్డి ప్రమాణం చేసి తన నిజాయతీని రుజువు చేసుకున్నారు.

### పాడి కౌశిక్ రెడ్డి హౌస్ అరెస్టు

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఇటీవల కాంగ్రెస్ నేత ప్రణవ్ కౌంటర్ ఇచ్చారు. చెల్పూరు హనుమాన్ టెంపుల్ దగ్గరకు రావాలని సవాలు విసిరారు. ఈ సవాలును పాడి కౌశిక్ రెడ్డి స్వీకరించారు.


## సబ్ స్టేషన్ ల స్థాయిలో కమిటీలు వేసి విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

హైదరాబాద్,ఎన్నికల కోడ్ మూలంగా ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లా వాసులు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకుంటే జీరో బిల్లు సౌకర్యాన్ని పొందలేకపోయారు, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసింది ఆ రెండు ఉమ్మడి జిల్లాల వాసులకు గత మార్చి నుంచే జీరో విద్యుత్ బిల్లు అమలు చేస్తాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సోమవారం ఆయన నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూరు లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన ఐదు జిల్లాల ట్రాన్స్కో ఎస్సీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ మూలంగా పొందలేకపోయిన జీరో బిల్లును మార్చి నుంచి అమలు చేస్తాం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారి మాదిరిగానే లబ్ధి చేకూరుస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. ఇప్పటికే 200 యూనిట్ల లోపు విద్యుత్ సరఫరా వినియోగించుకొని కరెంటు బిల్లు చెల్లించి ఉంటే వారి నగదు మొత్తాన్ని అకౌంట్లో ఉంచుతాం. ఎప్పుడైనా 200 యూనిట్లకు మించి వాడుకున్న సమయంలో వారి అకౌంట్లో ఉన్న నగదును వినియోగించుకుంటామని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువగా విద్యుత్తు సరఫరా చేసాం, గాలి, వాన అన్నిటినీ ఎదుర్కొని మీరు సేవలందిస్తున్నారు అయినా విద్యుత్ శాఖ పై కొద్ది మంది దుష్ప్రచారం చేస్తున్నారు అని డిప్యూటీ సీఎం తెలిపారు. దీనికి వెనుక గ్రామస్థాయిలో రాజకీయ కారణాలు ఒక అంశం కాగా, విద్యుత్ శాఖలోని కింది స్తాయి సిబ్బంది ఆ ప్రచారాలకు ఊ తమిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలను గమనంలో పెట్టుకొని ఎప్పటికప్పుడు దుష్ప్రచారాలను ఖండించాలని ట్రాన్స్కో ఉన్నతాధికారులకు సూచించారు. ప్రజలకు జవాబుదారీగా పని చేయాలి, నిబద్ధతతో ప్రజలకు ఏం చేస్తున్నామో వివరించాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది సమస్యలు సైతం మీరు ఎందుకు మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర జిడిపి పెంచడంలో విద్యుత్ శాఖది అత్యంత ప్రాధాన్య పాత్ర అని తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఎంత బాగా పనిచేస్తే రాష్ట్రంలో అంత బాగా ఉత్పత్తి పెరుగుతుంది, ఖజానాకు ఆదాయం సమకూరుతుందని వివరించారు. గ్రామస్థాయిలో జరిగే దుష్ప్రచారాలను సిబ్బంది ఖండించాలి, సిబ్బందికి మేము అండగా ఉంటాం సమిష్టి బాధ్యతతో పని చేద్దాం విద్యుత్ శాఖ సేవలు రాష్ట్ర ప్రజలకు అత్యంత అవసరమని తెలిపారు. వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగం అన్నింటికీ జీవనాధారం విద్యుత్



అని తెలిపారు. సిబ్బంది నిబద్ధతతో పని చేయాలి, ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలన చేస్తాను, చెడును తొలగించేందుకు వెనకాడను అని తెలిపారు. కరెంట్ షాక్ తో మరణించిన వారికి పరిహారం అందించడంలో విద్యుత్ శాఖ విఫలం అవుతుందని వినిపిస్తోంది, త్వరలో దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ వైర్లు, స్తంభాలు వంగిపోయీ ఉన్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యేలు ఫోన్ చేసి సమస్య చెప్పినప్పుడు అధికారులు వెంటనే స్పందించాలి, ఎమ్మెల్యేలు తెలిపిన సమస్య ఎంతవరకు పరిష్కరించారు వారికి తిరిగి సమాధానం ఇవ్వాలని డిప్యూటీ సీఎం విద్యుత్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యకు సంబంధించి %ఖువ, ఽవ, ఽవ% స్పందించలేదని బాధపడవద్దు 108 మాదిరిగా ఎవరికి, ఏ ప్రాంతంలో వారికైనా విద్యుత్ సమస్య వచ్చినప్పుడు 1912 నెంబర్ కు ఫోన్ చేయాలని కోరారు. కాల్ సెంటర్ కు వచ్చిన సమస్యను విద్యుత్ అధికారులు వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు సబ్ స్టేషన్ ల పరిధిలో కమిటీలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు విద్యుత్ శాఖ జీవనాడి లాంటిదని తెలిపారు. సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇంధన శాఖ సీఎం డి SMA రి జ్వీ, TGSPDCL సిఎండి ముషారాఫ్ అలీ ఉమ్మడి మహబూబ్ నగర్

## ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలి..



ఎల్లారెడ్డి పేట: వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఎల్లారెడ్డి పేట వైద్యశాలను నూతన కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డ్స్ ను పరిశీలించారు. దవాఖానలోని మందులు అందించే గది, రక్త పరీక్షలు చేసే ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూం ను, ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న అదనపు బెడ్స్ గదిని పరిశీలించారు. దవాఖానలో వైద్యులు, సిబ్బంది ఎందరు ఉన్నారని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని, జనరల్ వార్డ్ గది కిటికీలకు మస్కిటో నెట్ ఏర్పాటు చేయించాలని జనరేటర్ వినియోగంలోకి తీసుకురావాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న అదనపు బెడ్స్ గది పనులను వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సీహెచ్ సీ ఇంచార్జ్ డాక్టర్ బాబుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఆసుపత్రిలో సమస్యలు ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ మాట్లాడుతూ%ౌ% వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇక్కడ డాక్టర్లు రఘు, ప్రదీప్, సీహెచ్ సీ ఇంఛార్జి డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

### ఆటో, బైక్ ఢీ...నలుగురికి తీవ్రగాయాలు

వాజేడు, జూన్ 25 : ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పూసుర్ బ్రిడ్జిపై జరిగింది. ఏటూర్ నాగారం నుండి వెంకటాపురం వెళుతున్న ఆటోను పూసూరు బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికీ ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను 108 సహాయంతో ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సంపాదకీయం

బుధవారం 26-06-2024

# అప్పులకు పరిష్కారం ఎలా ?

ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా రాజధాని అన్నది ఓ తలకాయ లాంటిది. అది లేకుంటే తలలేదనే చెప్పాలి. అందుకే జగన్ తలకాయ లేని పనులన్నీ చేశారు. అప్పులను చేసి హాయిగా ఉన్నారు. 14 లక్షల కోట్ల అప్పు ఇప్పుడు ఎపి నెత్తిన పడింది. అంటే ఇది సామాన్యమైన అప్పుకాదు. తెలంగాణలోనూ ఇలాంటి పనే చేసి కెసిర్ 7లక్షల కోట్ల అప్పులు పెట్టారు. ఈ ఇద్దరు చేసిన నిర్వాకం కారణంగా ఇరు తెలుగు రాష్ట్రాలు 21 లక్షల కోట్ల అప్పులను మోయాల్సి వస్తోంది. ఇలా అప్పులు చేసి వదిలి వెళ్లిన వారిని వదిలేయడం సమంజసమా అన్నది ప్రజలు ఆలోచించాలి. కేంద్రం ఆలోచించాలి. పార్టీలు ఆలోచించాలి. ఇలా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసిన వారిని ఏం చేయాలన్నది చర్చించాలి. అప్పులో ఆస్తులు కూడా పెట్టామని బొంకిన మాజీ సిఎంలను ప్రజాక్షేత్రంలో నిలబెట్టాలి. ఎవరు అప్పులు చేసినా వారిని బోను ఎక్కించా ల్సిందే. దక్షత లేకుండా చేసిన పాలన కారణంగా ప్రజలు నష్టపోయారు. వీరు బాగుపడ్డారు. ఇకపోతే ఎపిలో అయితే మరీ దారుణంగా అప్పులు చేశారు. రాజధాని అన్నది కూడా లేకుండా చేశారు. జగన్ పాలనా పగ్గాలు చేపట్టిన ఐదేళ్లలో అప్పులు తప్ప ఒక్క మంచి పనీ చేయాలేదు. మళ్లీ తాను అధికారంలోకి వస్తానన్న ధీమాలో రుషికొండపై అద్దాల మేడలు కట్టుకున్నారు. మరోమారు తాను సిఎం అన్న ధీమాలో ఆయన పాలన సాగించారు. రాజధాని లేకుండా...మూడు రాజధానులు అంటూ ఊరించి ఐదేళ్లకాలం గడిపారు. ఈ ఐదేళ్లలో అటు అమరావతి కానీ..ఇటు వైజాగ్ కానీ రాజధానిగా చేయలేకపోయారు. కానీ మోయలేనంతగా అప్పులు మాత్రం చేశారు. రాజధానితో ఆపటు పోలవరం ప్రాజెక్టును, అభివృద్ధి కార్యక్రమాలను కోల్డ్ స్టోరేజికి ఎక్కించారు. తాను అధికారంలో ఉన్నంత కాలం అమరావతిపై స్పష్టత లేకుండా పాలన సాగించారు. ఇలా రాజధాని లేకుండా పాలన చేయొచ్చని నిరూపిచారు. తన పట్టుదలలో ఇసుమంతయినా సడలింపు లేకుండా సాగారు. దీనిని ప్రజలు ఎలా స్వీకరిస్తారన్నది ఎన్నికల్లో తేల్చి చెప్పారు. 151 సీట్లలో మధ్యలో 5ను లాగేసి కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. ఆయన ఆత్మపరిశీలన చేసుకోకుండా ఇవిఎంలను తప్పుపడుతున్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్న చందాన కెసిఆర్, జగన్‌ల తీరు ఉంది. రాష్ట్ర విభజన నాటి నుండి రాజధానిని ఎక్కడ నిర్మించాలనే సమస్య మొదలైంది. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా అవకాశం ఉన్నా ..చంద్రబాబు ఇక్కడినుంచి వదిలి వెళ్లారు. దీంతో అమరావతి కోసం నానా కష్టాలు పడ్డారు. గతంలో టిడిపి అధికారంలో ఉండగా చేపట్టిన అమరావతిలో అసలు నిర్మాణాలు జరగలేదని, డబ్బు వృధా చేశారన్న వాదనలు ముమ్మరం చేశారు. నవ్యాంధ్ర మొదటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికైన తర్వాత రాజధాని అమరావతి నిర్మాణం కోసం రైతుల నుండి వేల ఎకరాలు సమీకరించారు. పలు నిర్మాణాలు చేపట్టినా, పూర్తి చేయడంలో నిధుల కొరత కారణంగా అసెంబ్లీ, సచివాలయం తదితర నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో నిర్మాన పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఈలోపు జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పదవి చేపట్టిన నాటి నుండి రాజధానిని తరలిస్తారనే వాదన బలంగా వినిపించారు. అనుకున్నట్లే ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయని, ప్రాజెక్టులలో అవకతవకలు జరిగాయని ప్రాథమిక నివేదిక అందించింది. దీంతో రాజధాని తరలింపు తప్పదని స్పష్టం చేశారు. దీనికితోడు ఇక్కడ సేకరించిన భూముల్లో పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి సమస్యను మరింత జటిలం చేయాలని చూశారు. అప్పటికే రాజధాని నిర్మాణాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కేంద్ర సహకారం అంతంత మాత్రమే. అసలే నిధుల లేమితో కొట్టు మిట్టాడుతున్న రాష్ట్రం మళ్లీ రాజధానిని తరలిస్తే ఎంత నష్టపోతుందో ముఖ్యమంత్రి జగన్ గ్రహించ లేదు. అందుకే మూడు రాజధానాలు పేరుతో ఐదేళ్ల కాలం గడిపేశారు. రాజకీయ లబ్ది కోసం తడవకోసారి రాజధాని మార్చుకుంటూ పోతే రాష్ట్రం అథోగతి పాలవుతుందన్న విమర్శలు వచ్చినా ఆనాటి సిఎం జగన్ గుర్తించ లేదు. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు నాయుడు రాజధాని, పోలవరం నిర్మాణాల కోసం బాగానే కష్టపడ్డారు.న ఃూష్ట్ర సమగ్ర అభివృద్ధికి జలవనరులు దోహద పడతాయి. గోదావరి నదీ జలాలతో రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయవచ్చు. విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం గట్టిగానే పనిచేసింది. అయితే రూ.33 వేల కోట్లతో చేయవలసిన పునరావాస పనులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. జగన్ ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు వివరించి, పునరావాసం తో సహా ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉన్నా ఐదేళ్లలో కూడా పూర్తి చేయించలేదు. నదీజలాలు ఉన్నా వాడుకునే వ్యూహాలు కానరాలేదు. తాజాగా ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చారు కనుక గోదావరి నదీ జలాలను కృష్ణానదికి తరలింపుపై నిపుణులతో, అఖిల పక్షాలతో చర్చించిన తరువాత నిర్ణయాలు చేయాలి. ఉత్తరాంధ్రాలో వంశధార, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులను పూర్తి చేయాలి. ప్రకాశం జిల్లాకు ప్రాణప్రదమైన వెలిగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. 1956లో ఏర్పడిన ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధిని హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతం చేశారు. ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, ఐ.టి పరిశ్రమలు, కేంద్ర కార్యాలయాలన్నీ హైదరాబాదు లోనే అభివృద్ధి చేశారు. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజధాని పేరుతో కేంద్రీకరణకు పూనుకున్నది. రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల భూసమీకరణ, నవ నగరాల నిర్మాణ ఆలోచనలు, సింగ్‌పూర్ కంపెనీలతో స్టార్టప్ ఒప్పందం, స్విస్ ఛాలెంజ్ పద్ధతి, ప్రైవేటు సంస్థలకు భూముల కేటాయింపు మొదలైన చర్యలన్నీ చకచకా చేశారు. ఈ క్రమంలో ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాయలసీమలో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించి, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఇతర జిల్లాలలో కూడా అనేక ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. ప్రకాశం, గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతం, తూర్పు గోదావరి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం, పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజన ప్రాంతం, కృష్ణా జిల్లాలో ఎ. కొండూరు, గంపలగూడెం వంటి ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. విభజన చట్టంలో చెప్పిన విధంగా కడప ఉక్కు కర్మాగారం, దుగ్గరాజపట్నం/ రామాయ పట్నం ఓడరేవు ప్రభుత్వ రంగంలో నిర్మాణం జరగాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. నీటి వనరుల ఆధారంగా వ్యవసాయం, వెనుకబాటు తనం ఆధారంగా పరిశ్రమలు స్థాపించినప్పుడే సమగ్ర అభివృద్ధి జరుగుతుంది. రెండు రాష్ట్రాలకు ఇది వర్తిస్తుంది. ఈ దిశగా తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధి సాగాలి.

# రాజకీయ తీర్పు తర్వాత రాజ్యాంగ తీర్పులు?



న్యూఢిల్లీ,లోక్‌సభకూ ఎపితో సహా నాలుగు శాసనసభలకూ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వాలు కొలువు తీరాయి. అప్రతిహతంగా సాగిపోతుందనుకున్న నరేంద్ర మోడీ హవాకు బ్రేకులు వేశారు ఓటర్లు. మిత్రమంగానే ఆయన అధికారం చేపట్టవలసి వచ్చింది కూటమి. మోడీ సర్కారు ఏకపక్ష పోకడలకు ఇకనైనా కొంత పగ్గాలు పడతాయని ప్రజాస్వామిక లౌకిక వాదులు ఎదురు చూస్తున్నారు. ప్రజా న్యాయస్థానంలో పరిస్థితి ఇదైతే రాజ్యాంగ న్యాయస్థానాల్లో అంటే న్యాయ వ్యవస్థలో ఏమైనా మార్పులు రావడానికి ఇది దారితీస్తుందా అనే న్యాయవర్గాల్లో సాగుతోంది. ఎందుకంటే సంపూర్ణమైన ఆధిక్యత లేదంటే అంతకు మించిన సంఖ్యాబలం కలిగిన ఏక పార్టీ ప్రభుత్వాలు వున్నప్పుడు న్యాయవ్యవస్థ ఒక్కటిగా ఆలోచించి అడుగు వేస్తుందనేది ఇన్నేళ్ల అనుభవం. నిజానికి రాజ్యాంగం న్యాయ వ్యవస్థకు స్వయంప్రతిపత్తి ఇచ్చినప్పటికీ రాజకీయ వాస్తవాలు దృష్టిలో పెట్టుకుని ఇలా జరుగుతుందని అంటుంటారు.

### వివాదాలు, ఆరోపణలు

రాజ్యాంగ సంబంధమైన అంశాలలో కూడా సుప్రీం కోర్టు తీర్పులు, ఆదేశాలు, ఆలస్యాలు వివిధ వ్యాఖ్యలకు విమర్శలకు దారితీశాయి. తెలుగు రాష్ట్రాలలోనూ ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు తమ అనుకూలతలను బట్టి కోర్టులపై వ్యాఖ్యలు చేయడం తెలిసిన విషయమే. కేరళ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలలో కూడా కోర్టులపై వివాదస్పద సన్నివేశాలు చూశాం. 1991-1996 మధ్య కాంగ్రెస్ మెజార్టీ కోల్పోయిన పరిస్థితి. తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం వున్నప్పుడే న్యాయవ్యవస్థ క్రియాశీలత వంటి పదాలు ఎక్కువగా వాడుకలోకి వచ్చాయి. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావును కూడా విచారించిన ఘట్టం అప్పుడే చూశాం. 2004-14 మధ్య మన్మోహన్ సింగ్ హయాంలో మరీ ముఖ్యంగా మలి దఫా పాలనలో 2జి స్పెక్ట్రం, బొగ్గు గనుల వేలం, కామన్‌వెల్త్ క్రీడలు సుప్రీం కోర్టు ముందుకు మళ్లీ దేశ రాజకీయాలపై ఎంతో ప్రభావం చూపింది. అదే మోడీ హయాంలో రాఫెల్ కుంభకోణం. అయోధ్య తీర్పు, శబరిమల వివాదం, కాశ్మీర్ 370 అధికరణం ప్రతిపత్తి, పౌరసత్వ సవరణ చట్టం, ఇవిఎంలు, ఎన్నికల బాండ్లు ఇంకా అనేక అంశాల్లో అత్యున్నత న్యాయస్థానం తీరు అసంతృప్తిని మిగిల్చింది. రాజకీయ నేతలు, మీడియా ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ఆఖరుకు ముఖ్యమంత్రుల వంటివారిపై కేసుల్లో భిన్న ప్రమాణాలు పాటించడం ప్రశ్నార్థకమైంది. సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు కూడా పదవులలో పునరావాసం పొందిన తీరు మరో వివాదమైంది. ఈ నేపథ్యంలో బిజెపికి స్వంతంగా మెజార్టీ లేని పరిస్థితి న్యాయవ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఇది ఇప్పుడు, అనేకమందిని ఆలోచింపజేస్తున్న అంశం. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ సంజరు కిషన్ కౌల్ స్వయంగా ఈ మాటన్నారు. బలమైన కార్యనిర్వాహక వర్గం (ఎగ్జిక్యూటివ్) వుంటే న్యాయవ్యవస్థ గట్టి వైఖరి తీసుకోవడానికి కాస్త తటపటాయిస్తుందని ఆయన అన్నారు.

### సిజెఐ చంద్రచూడ్ వ్యాఖ్యలు

సిజెఐ చంద్రచూడ్ పదవీ కాలం ఈ నవంబర్ నెలతో ముగుస్తుంది. ఇటీవలి కాలంలో అత్యధిక కాలం పదవిలో ఉంటున్న సిజెఐ ఆయనే. స్వలింగ వివాహాల వంటి సామాజికాంశాల్లో సంచలన తీర్పులకు ఆధ్వర్యం వహించిన సిజెఐ చంద్రచూడ్ రాజకీయ రాజ్యాంగ అంశాల్లో ఒక విధంగా%ౌ%మిశ్రమ వ్యాఖ్యలే మూటకట్టుకున్నారు. ఎన్నికల బాండ్లపై వెలువడిన తీర్పు ఇటీవలి కాలంలో ప్రత్యేకించి చెప్పుకోవాలి. నవంబర్ రెండవ వారంలో పదవీ విరమణ చేసే ముందు ఆయన ఆరు రాజ్యాంగ సమస్యలపై తీర్పులు ఇవ్వాల్సి ఉంటుంది. సిజెఐతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాల ముందున్న తీర్పులు వాయిదా పడితే మళ్లీ కొత్త వారు రావడం, వీటిని పునర్వ్యవస్థీకరించడం పెద్ద ప్రక్రియ. ఆలస్యానికి దారితీయొచ్చు. అందుకే వేగంగా పూర్తి చేస్తున్నారు.

### ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ ప్రతిపత్తి

రాజ్యాంగం 16వ అధికరణం కింద వున్న ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లలో వర్గ వర్గీకరణ చెల్లుతుందా అనే ఉపీకరణ ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఫిబ్రవరిలో విచారించింది. 2010లో పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు 2004 %జ్యూ% వర్గీకరణ అంశంలో ఇచ్చిన తీర్పు తర్వాత పంజాబ్ విధానం అమలు కాకుండా పోయింది. అయితే ఈ విధంగా ఈ కొట్టివేయడం ఇందిరా సహానీ కేసులో 1992లో ఇచ్చిన చరిత్రాత్మక తీర్పుకు విరుద్ధమని పంజాబ్ వాదిస్తున్నది. ఆ కేసు తర్వాత చిన్నయ్య కేసులో సుప్రీం కోర్టు ఉప వర్గీకరణ కుదరదని చెప్పింది. ఇప్పుడు తుది తీర్పు వెలువడవలసి వుంది.ప్రతిష్టాత్మక అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఎ.ఎం.యు) రాజ్యాంగం 30వ అధికరణం ప్రకారం మైనార్టీ సంస్థ కిందకు వస్తుందా లేదా అనే అంశంలోనూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించాలి. 2006లో అలహాబాద్ హైకోర్టు మైనారిటీ ప్రతిపత్తి కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పును ఎమ్.యు సుప్రీంలో సవాలు చేసింది. తమ మైనార్టీ ప్రతిపత్తికి ముప్పు తెచ్చేలా ఎ.ఎం.యు చట్టానికి చేసిన వివిధ సవరణలు చెల్లవని వాదించింది. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. రంజన్ గొగోరు సిజెఐగా వుండగా ఈ కేసును ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించారు. ఫిబ్రవరిలో ఈ కేసు విచారణ ముగిసిన ధర్మాసనం తీర్పు రిజర్వులోవించింది. ఈ కేసులో తీర్పు దేశవ్యాపితంగా మైనార్టీ సంస్థల హక్కులకు సంబంధించి చాలా ప్రభావం చూపుతుంది.

### ఆస్తులు పునఃపంపిణీ తప్పా?

మూడో కేసుకు మరింత కీలకమైన రాజకీయ ప్రాధాన్యత వుంది. నిజానికి ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో వివాదం కూడా చేశారు. సంపద పునఃపంపిణీ జరగాలన్న రాజ్యాంగ నిర్దేశాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఒక దశలో మతం రంగు కూడా పులిమారు. వాస్తవం ఏమంటే రాజ్యాంగం 39వ ??అధికరణం సమాజ భౌతిక వనరులను సమిష్టి ప్రయోజనం కోసం ఉపయోగించాలని చెబుతున్నది. సమాజ భౌతిక వనరులను ఉమ్మడి ప్రయోజనం కోసం పునఃపంపిణీ చేయడానికి ఈ అధికరణం(బి) కనిపిస్తుంది. అయితే వ్యక్తిగత ఆస్తిని సమాజానికి చెందిన భౌతిక సంపదగా పరిగణించవచ్చునా అనే అంశంపై సుప్రీం కోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. ముంబయిలోని ఆస్తి యజమానుల సంఘం పేరుతో 20 వేలమంది భూ యజమానులు 1991లో మొదటి పిటిషన్ వేశారు. ఆస్తులను తీసుకోవచ్చునని మహారాష్ట్ర శాసనసభ చేసిన సవరణను వారు సవాల్ చేశారు. ఇదిలా వుండగానే 2019లో మళ్లీ మహారాష్ట్ర ప్రభుత్వమే గృహ చట్టానికి సవరణ చేస్తూ నిర్ణీత గడువు లోపల యజమానులు గనక ఆస్తిని పునరుద్ధరించకపోతే ప్రభుత్వం దాన్ని స్వాధీనం చేసుకోవచ్చని నిర్ణయించింది. ఈ సవరణ వల్ల గృహ సముదాయాలను హస్తగతం కలిగి ఉన్న మహారాష్ట్ర భవన నిర్మాణాలు పునరుద్ధరణ బోర్డుకు నిర్నిబంధ అధికారాలు సంక్రమిస్తాయంటూ వారు పంపిణీ చేస్తారు. ప్రైవేటు నిజంగా 39(ఎ) అధికరణం కింద పునఃపంపిణీ చేయడానికి అవకాశం వుంటుందా అనే అంశంపై ఇప్పుడు సుప్రీంకోర్టు ఆస్తుల తీర్పు ఇవ్వాల్సి వుంది. ఇక్కడ ప్రాథమికమైన అంశం ఏమంటే రాజ్యాంగం సంక్షేమరాజ్య భావనలో ఆర్థిక అసమానతల తొలగింపు కీలకాంశం. మోడీ వంటి వారు ఇదేదో వ్యక్తి గత ఆస్తి హక్కుకు భంగకరమన్నట్టు ప్రచారం చేసి అదరగొట్టడానికి ప్రయత్నించారు. మన దేశంలో కూడా ఇటీవలి వరకూ ఈ సంపద పన్ను, వారసత్వ ఆస్తి పన్ను వుండేవి. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు ముంబయి కేసుకే గాక దేశ విధానాలకే గీటురాయి.

### గనులు, ఆల్కహాలు

ఇక మిగిలిన రెండు రాజ్యాంగ కేసులు రాష్ట్ర కేంద్ర హక్కులకు సంబంధించినవి. పారిశ్రామిక ఆల్కహాలు, మద్యపానం ఆల్కహాలు గురించిన చర్చ ఇది. పారిశ్రామిక ఆల్కహాలపై నియంత్రణ ఎవరిదనేది ప్రశ్న, ఇవి రెండూ స్పిరిట్ నుంచే తయారవుతాయి. మరిన్ని రసాయన ప్రక్రియల తర్వాత అది పారిశ్రామిక ఆల్కహాలుగా మారుతుంది. ఏడవ షెడ్యూలులో ఈ రెంటినీ వుంచడం పరస్పర విరుద్ధ వ్యాఖ్యానాలకు దారితీస్తున్నది. ప్రజా క్షేమం రీత్యా పరిశ్రమలపై నియంత్రణ కలిగివుండే హక్కు కేంద్రానికి వుంది. మరోవైపున ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే విష పదార్థాలను నియంత్రించే అధికారం రాష్టంగా ఉంది. దాంతో ఎవరు అదుపు చేయాలనేదానిపై వివాదం కొనసాగుతోంది. సిజెఐ చంద్రచూడ్ ధర్మాసనం దీన్ని విచారించి తేల్చవలసి వుంది.గనుల నుంచి లోహాల తవ్వకంపై చెల్లించే రాయల్టీ పన్ను కిందకు వస్తుందా అనేది కూడా 25 ఏళ్లుగా వివాదంగా ఉంది. దాన్ని గనక పన్నుగా పరిగణించినట్లయితే అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అదనపు పన్ను విధించవచ్చు. 1963లో తమిళనాడు ప్రభుత్వం ఇండియా సిమెంట్స్‌పై రాయల్టీ గాక అదనపు పన్ను విధించడంతో ఈ వివాదం మొదలైంది. దాని మీద వరసగా విచారణలు జరిపిన తరువాత 1989లో సుప్రీంకోర్టు రాయల్టీ ఒక పన్ను అని నిర్ధారించబడింది. ఈ గనుల కాంట్రాక్టర్లకు పారిశ్రామికవేత్తలకు మింగుడు పడలేదు.వారు అనేక హైకోర్టులలోనూ సుప్రీం కూడా సవాలు చేయగా అదేదో అనుకోకుండా జరిగిన అచ్చు తప్పు వంటిదని అభిప్రాయపడ్డారు. అదనపు పన్నును గురించి మాత్రమే కోర్టు పరిశీలించింది తప్ప రాయల్టీని ఉద్దేశించి తీర్పు చెప్పలేదని వివిధ కోర్టులు వ్యాఖ్యానించాయి. ఇది పన్ను అని తేలిస్తే రాష్ట్రాలు దాన్ని పెంచి ఆదాయం పెంచుకోవడానికి వీలవుతుంది. అసలే వనరుల కొరతతో ఇబ్బంది పడే రాష్ట్ర ప్రభుత్వాలకు కాస్త వెసులుబాటు దక్కుతుంది. దాదాపు కిందట విచారణ జరిపిన తొమ్మిది మంది ధర్మాసనం తీర్పు రిజర్వు చేసి వుంచింది.

### మరింత జఠిలం

వీటన్నిటిపై ప్రజాస్వామిక పరిష్కారాలు వస్తాయా అని ఎదురు చూస్తుంటే పులి మీద పుత్రల కొత్త వివాదం బయలుదేరింది. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను లిక్కర్ కేసులో కింద కోర్టు బెయిలుపై విడుదల చేస్తే ఢిల్లీ హైకోర్టు ఆపివేయబడింది. కానీ పోస్కో కేసులో కర్ణాటక మాజీ ఎడియూరప్పను అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వులిస్తే మాజీ ముఖ్యమంత్రి అలా ఎలా చెప్తారని హైకోర్టు ఆపేసింది. ఈ ద్వంద్వ నీతిని న్యాయ నిపుణులు తీవ్రంగా ప్రశ్నించారు. లోక్‌సభ ఫలితాలు వచ్చాకనే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్%ౌ%ప్రముఖ రచయిత అరుంధతీ రారుపై రాజద్రోహ నేరారోపణ విచారణ జరపాలని అనుమతినివ్వడం కూడా నిరసనకు గురైంది. నేర చట్టాలను ఇష్టానుసారం మార్చి అమలు కోసం హడావుడి పడటం కూడా ఆక్షేపణకు దారి తీస్తున్నది. అందుకే రానున్న రోజుల్లో ఈ అంశాలు దేశంలో మరింత చర్చనీయాంశం కానున్నాయి. కార్యాచరణకూ దారితీస్తాయి.

# మండలాల్లో సమస్యల తిష్ట..వెక్కిరిస్తున్న నిధుల కొరత

ఖమ్మం,గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం కొత్తగా మండలాలను ఏర్పాటు చేసినా అక్కడి వసతులపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టలేదు. ఫలితంగా మండలాల్లో ఇప్పటికీ అనేక సమస్యలు వెంటాడుతేనే ఉన్నాయి. ప్రధానంగా భవనాలు, సిబ్బంది కొరత వేధిస్తుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు తప్పటంలేదు. ఇక నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన అన్నపురెడ్డిపల్లి మండలంలో అనేక సమస్యలు ఉన్నాయి. అనేక ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. ఫలితంగా అటు ప్రజలు, ఇటు అధికారులు కూడా ఇబ్బందులు పడకతప్పటం లేదు. మండల పరిషత్తులకు ఏటా వివిధ గ్రాంటుల కింద నిధులు ఇస్తే ఎటువంటి అభివృద్ధి పనులు అయినా చేయటానికి అవకాశం ఉంటుంది. నిధులు లేకపోతే పనులు ఎలా చేయగలమని ప్రజాప్రతినిధులు అంటున్నారు. మండల ప్రజాపరిషత్తులకు నూతన పాలకవర్గాలు ఏర్పడి మూడు నెలలు గడిచినా నిధులు, విధులు లేక ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నారు. ఎన్నికల వేళ సమస్యలు పరిష్కరిస్తామని హామీలు గుప్పించి గెలిచిన తరువాత హామీల నెరవేర్చలేని దుస్థితిలో మండల పరిషత్తు అధ్యక్షులు, ఎంపీటీసీలు ఉన్నారు. సమావేశాలకు వెళ్లటం, చెప్పింది వినటం, తిరిగి రావటం తప్ప ఏపని చేయలేక ఆవేదన చెందుతున్నారు. ప్రజలు సమస్యలు చెపుతుంటే విని నిస్సహాయస్థితిలో ఉండటం తప్ప ఏపని చేయలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గం పూర్తిగా గిరిజన ప్రాంతం. ఇక్కడ పూర్తిస్థాయిలో నిధులు వస్తేనే అంతంతగా అభివృద్ధి జరుగుతుంది. కానీ గత కొంతకాలంగా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులను విడుదల చేయటం లేదు. పంచాయతీలకు నిధులు వస్తున్నా పెరిగిన జనాభాకు, పుట్టుకొస్తున్న సమస్యల పరిష్కారానికే నిధులు సరిపోని పరిస్థితి. గతంలో పంచాయతీలతో పాటు మండల పరిషత్తులకు వివిధ రూపాల్లో వచ్చిన నిధులతో పల్లెల్లో ఎంతోకొంత అభివృద్ధి పనులు చేపట్టేవారు. కానీ గత కొంతకాలంగా నిధులే ఇవ్వకపోవటంతో మండల పరిషత్తు నుంచి ఎటువంటి అభివృద్ధి పనిని చేపట్టలేకపోతున్నారు. దీంతో పల్లెల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. పంచాయతీల ద్వారా వచ్చే నిధులతో తాగునీటి, అంతర్గత రహదారులపై అపుడపుడూ మట్టి పరచటం, పారిశుద్ధ్యం వంటి పనులు మినహా ఎటువంటి ఇతర పనులు చేయలేని పరిస్థితి ఉంది. మండలస్థాయిలో పరిపాలనకు ప్రధాన కేంద్రం మండల పరిషత్తులే.. అయితే మండల పరిషత్తులకు సాధారణ నిధులు మినహా అభివృద్ధి పనులకు సుమారు దశాబ్దం నుంచి ఎటువంటి నిధులు అందటం లేదు. దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలు ఆర్థిక ఇబ్బందులతోనే కాలం గడుస్తోంది. దమ్మపేట రెవెన్యూలో కొద్దిగా రిజిష్ట్రేషన్ ఫీజులో వచ్చే వాటా సహితం గత సంవత్సరం నుంచి పెండిగులో వుంది. సాధారణ నిధులు సహితం విడుదలవకపోవడంతో కరంటు బకాయి వుంది.

# ముందుచూపు...

న్యూఢిల్లీ,ఉత్తరప్రదేశ్‌లో ఉంది రాయ్‌బరేలీలోని తనకే అట్టిపెట్టుకుని కేరళలోని వయనాడ్ నియోజక వర్గాన్ని తన సోదరి ప్రియాంక గాంధీకి అప్పగించడం వెనుక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందుచూపు స్పష్టత. ఉత్తరప్రదేశ్‌లో తిరిగి కాంగ్రెస్ వైభవాన్ని పెంపొందించుకోడానికి, 2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఎక్కువ సీట్లు సాధించడానికి రాయబరేలీ స్థానమే కేంద్రంగా కాంగ్రెస్ మలచుకుంటుంది. ఇప్పుడు కాంగ్రెస్‌కు సురక్షితమైన స్థానంగా పరిగణిస్తున్న వయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ విజయం సాధిస్తే నెహ్రూ గాంధీ కుటుంబం నుంచి మొదటిసారి పార్లమెంట్‌కు ముగ్గురు ఒకేసారి పాల్గొనే అవకాశం కలుగుతుంది.దీంతోపాటు ఒకే కుటుంబం నుంచి వారసత్వ రాజకీయాలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందన్న ఆరోపణలు కూడా వస్తాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్‌లో ఆరు స్థానాల్లో విజయం సాధించి మళ్లీ కోలుకోగలిగింది. గత ఐదేళ్లుగా దాదాపు ఉనికిని కోల్పోయిన కాంగ్రెస్‌కు ఈసారి ఎన్నికల ఫలితాలు ఊపిరి పోశాయి. ఉత్తరప్రదేశ్ కాషాయనాథుల కంచుకోట అన్న ప్రతిష్టకు బీటలు పడ్డాయి. ప్రధాని కాషాయనాథుల్లో ప్రముఖునిగా, మోడీ అమిత్ షా ద్వయానికి అత్యంత సన్నిహితునిగా పేరు పొందిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సామర్థ్యానికి సవాలుగా ఉత్తరప్రదేశ్‌లోని ఎన్నికల ఫలితాలు ఊహించని అనుభవాన్ని మిగిల్చాయి. ఇక కాంగ్రెస్ కూడా వారికి ఫలితాలు ఇంత అనుకూలంగా వస్తాయని ఊహించలేదు. 2014లో కాంగ్రెస్ రాయ్‌బరేలీ, అమేథీ స్థానాలను సాధించి, ఓట్ల వాటా 7.53% వరకు దక్కించుకోగలిగింది, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం రాయబరేలీ మినహా అమేథీతో సహా అన్ని స్థానాలను కాంగ్రెస్ కోల్పోయింది.ఆనాడు బిజెపి అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓడిపోయారంటే కాంగ్రెస్ ఉనికి అప్పుడు ఏ విధంగా కోల్పోయిందో చెప్పవచ్చు. ఈసారి కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేసి, మిగిలిన స్థానాలను 'ఇండియా' కూటమి అభ్యర్థులకు విడిచిపెట్టింది. పరిమిత స్థానాల్లోనే పోటీ చేసినప్పటికీ ఆరు స్థానాల్లో గెలవగలిగింది. ఓట్ల వాటా 9.46 శాతం పెంచుకోగలిగింది. ఉత్తరప్రదేశ్ దిగువ సభ నుంచి సానుకూల ఫలితాలు రావడంతో పార్లమెంట్ అత్యంత గరిష్ఠ స్థాయిలో పొందగలిగింది. మరో ముఖ్యమైన అంశం ఏమంటే కాంగ్రెస్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీకి ఉత్తరప్రదేశ్‌లో సానుకూల ఫలితాలు రావడంతో ఆ రాష్ట్ర ఓటర్ల మనోభావం బిజెపికి వ్యతిరేకంగా ఉంది.2019లో ఉత్తరప్రదేశ్‌లో బిజెపి 62 సీట్లలో విజయపతాకం ఎగురవేయగా, ఇప్పుడు కేవలం 33 సీట్లనే దక్కించుకోగలిగింది. దీన్ని బట్టి ఉత్తరప్రదేశ్‌లో కమలనాథులకు ప్రజాదరణ సగానికి సగం తగ్గినట్టుగా ఉంది. ఈ పరిణామాలను పరిశీలించి రాహుల్ దూరదృష్టితో కాంగ్రెస్ ఉనికిని మరింత పటిష్టపర్చుకోడానికి గట్టిగా పని చేయాలన్న లక్షంతో రాయ్‌బరేలీ కోసం విడిచిపెట్టలేదు. దీని ద్వారా ఉత్తరప్రదేశ్‌లోను, హిందీ రాష్ట్రాల్లోనూ తమ పోరాటాన్ని బిజెపిపై కొనసాగిస్తామని, మరిన్ని ఫలితాలు సాధిస్తామని కాంగ్రెస్ స్పష్టమైన సందేశాన్ని అందించింది. ఈ మేరకు 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను సాధించేందుకు ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేస్తోంది.2022లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 403 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేసినా కేవలం రెండే రెండు స్థానాలను దక్కించుకోగలిగింది. ఓట్ల వాటా కూడా 2.33 పడిపోయింది. ఈ నేపథ్యంలో మిత్రపక్షం సమాజ్‌వాది పార్టీతో కలిసి రాహుల్ రాయ్‌బరేలీలో తమ పట్టు గట్టిగా నిలదొక్కుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.అందుకే రాయ్‌బరేలీ రానున్న అసెంబ్లీ ఎన్నికలకు రాహుల్ వ్యూహాత్మక కార్యస్థాన కేంద్రంగా రూపుదిద్దుకోనున్నది. కేరళలోని వయనాడ్ స్థానం గురించి రాహుల్ పదేపదే భావోద్వేగ సంబంధంగా అభివర్ణించడం ఈ సందర్భంగా ప్రస్తావించడం అవసరం. 2019లో కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్‌లో దాదాపు తుడిచిపెట్టుకుపోయినప్పుడు వయనాడ్ స్థానమే రాహుల్‌ను ఆదుకోగలిగింది. తమ కుటుంబానికి కంచుకోటగా ఉంటున్న అమేథీ కూడా రాహుల్‌కు దూరమైనప్పుడు కేరళలోని కాంగ్రెస్ నాయకుల కోసం యుడిఎఫ్ ఆసరా కల్పించింది. అందుకనే కాంగ్రెస్‌కు సురక్షితమైన స్థానంగా విశ్వసిస్తోన్న వయనాడ్ నుంచి ఉప ఎన్నికకు పోటీ చేయడానికి రాహుల్ ప్రోద్బలంతో ప్రియాంక గాంధీ సిద్ధమయ్యారు.

# అయోధ్య గర్భగుడిలోకి వర్షపు నీరు..




అయోధ్య: బీజేపీ సర్కార్ 2024 జనవరి 22న ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన అయోధ్య రాముడి ఆలయంగర్భ గుడిలో ఒక్క వర్షానికే నీరు వచ్చి చేరింది. ఆలయాన్ని ప్రారంభించి ఏడాది కూడా గడవకముందే లీకేజీలు ఏర్పడటం విమర్శలకు తావిస్తోంది. మొదట వర్షం కురిసినప్పుడే గర్భాలయంలోకి నీరు వచ్చి చేరాయని ఆలయ ప్రధాన అర్చకుడు సత్యేంద్ర దాస్ చెప్పారు. దీనితో రామ మందిర నిర్మాణ పటిష్టతపై అనుమానాలు వస్తున్నాయి.ఆలయ పైభాగాన్ని సరిగ్గా అమర్చాలని వారిపై చర్యలు తీసుకోవాలని సత్యేంద్ర దాస్ డిమాండ్ చేశారు. నిర్మాణ దశలో ఉన్న సమస్యలేంటో గుర్తించి వాటిని ఒకట్రెండు రోజుల్లో పరిష్కరించాలని నిర్ణయించారు. అసలే వర్షాకాలం కావడంతో సమస్య పరిష్కరించుకుంటే పూజలు చేయడం కష్టంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

### అప్పటి వరకు ఆలయ నిర్మాణం అసాధ్యం...

"2025కి కేవలం ఏడాది మాత్రమే మిగిలి ఉంది. చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. కాబట్టి, నిర్మాణ పనులు ఏడాదిలోపు పూర్తయ్యే అవకాశం లేదు. నిర్ణీత స్థలాల్లో ఇతర దేవుళ్ల విగ్రహాలు ఉంచే పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాదికల్లా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం ఏర్పడిన సమస్యను అధికారులు పరిశీలించి పరిష్కరించాలి. వర్షపు నీరంతా రామ్ లల్లా విగ్రహం చుట్టూ వచ్చి చేరాయి. ఆలయంలో లీకేజీ సమస్య ముఖ్యమైంది. దానిని త్వరగా పరిష్కరించాలి" అని సత్యేంద్ర దాస్ అధికారులను నిర్ణయించారు.

# అభివృద్ధికి అనుగుణంగా కార్యాచరణ

అమరావతి,సమాజంలో అన్ని తరగతుల ప్రజలు, వివిధ సామాజిక వర్గాలు అభివృద్ధి చెందితే సమ్మిళిత అభివృద్ధి అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 17 శాతం దళితులు, 6 శాతం గిరిజనులు, 9 శాతం మైనారిటీలు, 47 శాతం బి.సిలు ఉన్నారు. సబ్‌ప్లాన్ ఉన్నప్పటికీ దళితులు, గిరిజనుల అభివృద్ధి ఆశించిన విధంగా లేదు. దళితులు, గిరిజనులు మొదలగు సామాజిక వర్గాల అభివృద్ధి భూ సమస్యతో ముడిపడి ఉన్నది. విద్యారంగంలో రెండు సమాంతర వ్యవస్థలు కొనసాగుతున్నాయి. బడికి వెళ్లే 70 లక్షల మంది పిల్లలలో 38 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలలో, 32 లక్షల మంది ప్రైవేట్ పాఠశాలలో చదువుతు న్నారు. ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యా రంగాన్ని పటిష్ఠ పరచాలి. డెల్టా ప్రాంతాలలో దళితులకు కనీసం స్మశానం కూడా లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. గిరిజన ప్రాంతాలలో వైద్య సదుపాయాలు అందక కిలోమీటర్ల దూరం నడచి వెళుతున్నారు. మొత్తంలో సహజ వనరులను ఉపయోగించు కొని సుస్థిర అభివృద్ధి సాధించాలి. సహజ వనరులు దోపిడీ చేయడానికి అభివృద్ధి పేరుతో పర్యావరణ విధ్వంసానికి ప్రయత్నం జరుగుతున్నది. రాష్ట్రంలో కడప జిల్లాతో సహా అనేక ప్రాంతాలలో జరుగుతున్న యురేనియం తవ్వకాలు దీనికి ఒక ఉదాహరణ. ఉత్తరాంధ్రలో బాక్సైట్ గనులను దోపిడీ చేయడానికి జిందాల్ వంటి కంపెనీలు ప్రయత్నించాయి. ఇసుక మాఫియా ప్రకృతిని, నదులను నాశనం చేస్తున్నది. అటవీ ప్రాంతాన్ని విధ్వంసం చేస్తున్నారు. రాష్ట్రంలో అటవీ ప్రాంతం 19 శాతం మాత్రమే ఉన్నది. పర్యావరణ సమతుల్యానికి 33 శాతం అడవులు అవసరం. ప్రకృతి వనరులను కాపాడుకుంటూ అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడే విధంగా సుస్థిర అభివృద్ధి కొనసాగించాలి. భూసమస్యలపై నియమించిన కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు జరగలేదు. భూ కేంద్రీకరణ కొనసాగుతూనే ఉన్నది. భూ పంపిణీ గురించి ప్రభుత్వాలు మాట్లాడడం లేదు. ల క్షకు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. గత ఐదేళ్లలో మూడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వీరిలో కౌలు రైతులే ఎక్కువ. 2011లో చేసిన కౌలు రైతుల రక్షణ చట్టం కౌలు రైతుల ప్రయోజనాలను కాపాడలేక పోయింది. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆమోదించిన నూతన కౌలు చట్టంలో కూడా కౌలు రైతులకు ఉపయోగపడే అంశాలు లేవన్న విమర్శలు ఉన్నాయి. భూయజమానులు కౌలు రైతులతో రాత పూర్వక ఒప్పందానికి సిద్ధంగా లేరు. రైతు భరోసా పథకం కూడా కౌలు రైతులకు ప్రయోజకరంగా లేదు. 'అమ్మఒడి' వంటి పథకాలు విద్యా రంగంలో మౌలిక మార్పులకు దోహదపడవు. ఉన్నత విద్యారంగం, ఇంటర్ విద్యను మార్కెట్ శక్తుల నుంచి విముక్తి చేయాలన్న సూచనలు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతులు, డాక్టర్ల కొరత సమస్యలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ ప్రజలకు ఉపశమనం లేదు. ఆరోగ్యంపై నియమించిన సుజాతారావ్ కమిటీ సిఫార్సులను అధ్యయనం చేసి, ప్రభుత్వ ఆస్పత్రులను పటిష్ఠ పరచాలన్న సూచనలు ఉన్నాయి. మొత్తంలో సమగ్రాభివృద్ధి సాధించాలంటే వివిధ ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తూ, అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యత సాధించాలని మేధావులు సూచిస్తున్నారు.

# కొత్తగా ఆరుగురికి అవకాశం

హైదరాబాద్,త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. దీనికి జులై 2 ముహూర్తం ఖరారైనట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో సీఎం రేవంత్ మంత్రివర్గ విస్తరణపై దృష్టిసారించారని పార్టీ వర్గాలు ద్వారా తెలుస్తోంది. అలాగే ఇప్పటికే ప్రకటించిన 37 నామినేటెడ్ పోస్టుల భర్తీపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అధిష్ఠానం సూచన మేరకు వాటిలో కొన్ని మార్పులు చేర్పులు చేసి ఫైనల్ చేయనున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈసారి మంత్రివర్గంలో 6 గురికి చోటు దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. వారిలో ఇద్దరు రెడ్డి, ఇద్దరు బీసీ, ఒక్కరు ఎస్టీ చోటు దక్కనున్నదని సమాచారం. మరొకటి మైనారిటీ కి ఇవ్వాలని పార్టీ యోచిస్తున్నా.. మైనార్టీ ఎమ్మెల్యే ఒక్కరూ కూడా లేకపోవ డం తో ఆ స్థానాన్ని ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి దక్కనున్నట్టు సమాచారం. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ దగ్గరే హోం, విద్య, మున్సిపల్, కార్మిక శాఖలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నాలుగు శాఖలు కొత్తగా మంత్రివర్గంలో తీసుకునే వారికి కేటాయించే అవకాశం ఉన్నదని అంటున్నారు. మంత్రివర్గలో చోటు దక్కించుకోవడానికి ఎవరికి వారు ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి విలేకరుల సమావేశంలో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని వెల్లడించారు. ఈ మేరకు తనకు సమాచారం ఉన్నదన్నారు.దీంతో బీసీ సామాజికవర్గ కోటాలో ఆయన బెర్త్ ఖాయమైనట్టేనని చెబుతున్నారు. మంత్రిగా మరో బీసీకి అవకాశం దక్కనుండటంతో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఇక రెడ్డి సామాజిక వర్గం నుంచి బోధన్ ఎమ్మెల్యే సీనియర్ కాంగ్రెస్‌నేత పీ సుదర్శన్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్టే అని సమాచారం. అలాగే హోం శాఖ బాధ్యతలు ఆయనకే అప్పగిస్తారని టాక్ వినిపిస్తున్నది. అయితే ఇటీవల బాన్స్‌వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీలో చేరారు. ఆయన సేవలను ఉపయోగించుకుంటామని, ఆయనకు ప్రభుత్వంలో ప్రాధాన్యం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ ఇద్దరిలో చివరికి ఎవరికి దక్కుతుందో అన్న వాదనలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఈసారి మంత్రివర్గంలో చోటు దక్కడం ఖాయమనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతున్నది. ఇదే సమయంలో పరిగి ఎమ్మెల్యే రాం మోహన్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్టీ కోటాలో దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్‌కు అవకాశం ఇస్తారని అంటున్నారు.మరొకటి మైనారిటీలు ఇవ్వాలనుకుంటున్నా పార్టీ తరపున ఎవరూ లేకపోవడంతో ఎస్సీ సామాజికవర్గానికికి దక్కవచ్చని చెబుతున్నారు. అయితే దీనికోసం పోటీ తీవ్రంగానే ఉన్నది. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, బీఆర్ఎస్ నుంచి వచ్చిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంత్రిపదవిని ఆశిస్తున్నారు. మాదిగ సామాజికవర్గానికి కాంగ్రెస్ పార్టీ మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు ఇవ్వకపోవడంపై వివాదం చెలరేగింది. మోత్కుపల్లి లాంటి ఇప్పుడు కూడా అదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇప్పటికైనా తమ సామాజికవర్గానికి న్యాయం చేయాలని కోరుతున్నారు. దీంతో ఎస్సీ కోటాలో ఎవరికి ఆ అవకాశం దక్కుతుంది అన్నది వేచి చూడాలి. అంతేకాదు బీఆర్ఎస్ నుంచి 20 ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారని ఖైరాతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ దిశగా ప్రయత్నాలు ఏమైనా జరుగుతున్నాయా? అలా పెద్దమొత్తం బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు వస్తారా? దీనిపై ఎవరితోనైనా సంప్రదింపులు చేశారా? వారికి ఏమైనా హామీ ఇచ్చారా? అన్నది తేలాల్సి ఉన్నది. ఒకవేళ అదే జరిగితే మంత్రివర్గంలో ఇప్పుడు ప్రచారం జరుగుతున్న పేర్లలో మార్పులు చేర్పులు ఉండొచ్చు అంటున్నారు.

# మహిళలకు న.మో వట్టి విస్తరి, పచ్చి మంచినీళ్లు

న్యూఢిల్లీ,బేటీ బచావో-బేటీ పఢావో, మహిళా సురక్ష కేంద్ర, మహిళా పోలీసు వలంటీర్లు, రాష్ట్రీయ కోష్, సుకన్య సమృద్ధి యోజన, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయఇవన్నీ మన దేశంలో ఉన్న మహిళా పథకాలు, ఎవరికో చెప్పనవసరం లేదు. కొన్ని రాష్ట్రాల్లో వీటికి పేర్లు మార్చి అమలు చేస్తున్నారు. మొత్తం మీద ఇన్ని జరిగిన తరువాత కూడా ప్రపంచంలో స్త్రీ, పురుష సమానత్వ తేడాలో 2024 ప్రపంచ 146 దేశాల జాబితా ప్రకారం మన స్థానం 129. పదేళ్లతో పోల్చుకుంటే దిగజారింది. మహిళల అభ్యున్నతి గురించి గత పది సంవత్సరాలుగా గొప్పలు చెప్పుకున్న, మహిళలను వంచించిన వారు, వారికి భజన చేసిన ఘనులు తలలెక్కడ పెట్టుకుంటారో చూడాలి. పథకాలన్నీ మావే, రాష్ట్రాల పేర్లను మార్చాయి, అలా మా ఫొటోలు పెట్టాలి, వాటి "ఖ్యాతి"లో మాకూ వాటా రావాలని కోరుతున్న బిజెపి పెద్దలు ఆ స్థలాన్ని తీసుకున్న వారే ఎవరికీ అభ్యంతరం లేదు. రాష్ట్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నది బిజెపి, మిత్రపక్షాలే. మెరుగు పరచకపోయినా దిగజారటానికి నెపం నెహ్రూ మీద, గాంధీ మీద నెడితే కుదరదు.సూచికలను రూపొందించటానికి నాలుగు అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. 1.ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం, అవకాశాలు, 2. విద్యా అవకాశాలు, 3. ఆరోగ్యం, బతుకు, 4. రాజకీయ సాధికారత. వీటన్నింటిలో ఏ దేశం ఎక్కడుందనే సూచికలు, పాయింట్లు వేస్తారు. వాటన్నింటిని కలిపి మొత్తంగా సాధారణ సూచికలను రూపొందించారు. ఇలాంటి నివేదికలను 2006 నుంచి ప్రతి ఏటా రూపొందించారు. తీసుకున్న 146 దేశాల సగటు లింగ సమానత్వ తేడా 2024లో 68.5 శాతం ఉంది. కేవలం 0.1 శాతమే మెరుగైంది. అంటే 31.5 శాతాన్ని పూరించాల్సి ఉంది. ఇప్పుడున్న వేగంతో తేడాను పూర్తిగా తగ్గించాలంటే 134 సంవత్సరాలు పడుతుంది. ప్రపంచంలో నూటికి నూరు శాతం సమానత్వం సాధించిన దేశమేమీ లేదు. మొదటి స్థానంలో ఉన్న ఐస్‌లాండ్‌లో 93.5 శాతం సాధించారు. భారత్‌లో 64.1 శాతం ఉంది. ఈ లెక్కన పూర్తి సమానత్వం సాధించటానికి కనీసం 152 సంవత్సరాలు పడుతుంది. దక్షిణాసియా దేశాల సగటు తేడా 63.7 శాతమే. పది సంవత్సరాల నాడు మొత్తం ర్యాంకు మార్కులను చూస్తే 0.6455 కాగా తాజా సూచికలో 0.641కి దిగజారింది.మన దేశంలో లింగ బేధాలను తగ్గించటంలో పదేళ్ల నరేంద్ర మోడీ పాలన ఘోరంగా విఫలమైంది. మరింత దిగజారింది. ఇరుగు పొరుగు దేశాలలో బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్ తరువాత ఐదవదిగా మన దేశం ఉంటే బిజెపి పెద్దలు నిత్యం స్మరించే పాకిస్తాన్ ఏడవదిగా ఉంది. ఆర్థిక భాగస్వామ్యం, ఆరోగ్యంలో 146కు గాను 142వదిగ ఉంది (మన తరువాత పాకిస్తాన్‌లో ఉంది). విద్య అందుబాటులో 112, రాజకీయ రంగంలో 65, కార్మికశక్తి భాగస్వామ్యంలో 134వదిగ ఉంది. విద్యా అవకాశాలు, రాజకీయ సాధికారత తగ్గుదల కారణంగానే 127వ ర్యాంకు 129కి దిగజారింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడానికి ఆ స్ఫూర్తిని రాజకీయ పార్టీలేవీ పాటించలేదు. దాని ఘనత తమదే అని భుజాలు చరుచుకున్న బిజెపి 30 మంది క్యాబినెట్ మంత్రులకు గాను కేవలం ఇద్దరికి పరిమితం చేసింది. మొత్తం మంత్రివర్గంలో గతంలో ఉన్న పది మందిని ఈసారి ఏడుకు తగ్గించింది. నేపాల్‌లో కేంద్ర, రాష్ట్రాలలో ఉన్న మంత్రులలో 23.5 శాతం మంది మహిళలు ఉన్నారు. చట్టసభల్లో మహిళల ప్రపంచ సగటు 33 శాతం కాగా అక్కడ 49.9 శాతం ఉంది.జనాభాలో సగంగా ఉన్న మహిళలకు ఉత్పాదక రంగంలో భాగస్వామ్యం కల్పించకుండా వారి సాధికారత గురించి ఎన్ని కబుర్లు చెప్పినా వట్టి విస్తరి పచ్చి మంచి నీళ్లు తప్ప మరొకటి కాదు. గడచిన పది సంవత్సరాల్లో జరిగింది అదే. లింగ సమానత్వ తాజా నివేదికలో మన కార్మిక శక్తిలో మహిళా భాగస్వామ్యం 35.09 శాతం చూపించినట్లు దేశంలో ఉంది. ఇది కూడా ప్రభుత్వం అందచేసిన తప్పుడు లెక్కల కారణంగానే. నిజంగానే అంత ఉందా? లోక్‌సభ ఎన్నికలకు ముందు మహిళా తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టే ముందు నరేంద్ర మోడీ తన పాలనలో అభ్యున్నతిని చూసి ప్రతిపక్షాలు ఆత్మశోధన చేసుకోవాలని చెప్పారు. తన పదేళ్ల ఏలుబడిలో దిగజారిన ర్యాంకును చూసి తల వంచుకుంటారా? ప్రతిపక్షాలకు సుభాషితాలు చెబుతూనే ఉంటారా? ప్రభుత్వం ప్రకటించిన ప్రభుత్వ లెక్కలకు, పొంతన



కుదరటం లేదు. స్టాటిస్టా విశ్లేషణ ప్రకారం 2014 నుంచి 2022 వరకు తొమ్మిదేళ్ల సగటు 26.81 శాతం కాగా 2023లో 32.68 శాతం అదే సంస్థ ఉంది. ఒక్కసారిగా అంత ఎలా పెరిగింది? ప్రపంచ బ్యాంకు లెక్క 32.7 శాతం అన్నది. 2022-23లో నియమిత కార్మిక శక్తి సర్వే ప్రకారం మహిళలు అంతకు ముందు 4.2 శాతం పెరిగి యూజువల్ స్టేటస్ లెక్కింపు అవగాహన ప్రకారం 37 శాతం చేరినట్లు ప్రభుత్వం అక్టోబరు తొమ్మిదిన ప్రకటించింది. అందుకే అంకెల గారడీ అనాల్సి వస్తోంది.ఇండియా టుడే వెబ్‌సైట్ 2023 జూన్ పదకొండున్న రోషిణీ చక్రవర్తి రాసిన విశ్లేషణకు "భారత్‌లో తగ్గుతున్న మహిళా శ్రామికులు, ఎందుకు మహిళలు పని చేయటం లేదు?" అనే శీర్షిక పెట్టింది. భారత్‌లో వేతనాలు చెల్లించే ఉపాధిలో మహిళలు ఇరవై ఏళ్లలోపుగానే ఉన్నట్లు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదికను ఉటంకించింది. ఐఎల్‌ఓ నివేదిక ప్రకారం ఉపాధిలో కేవలం 19.2 శాతం మంది మాత్రమే మహిళలు ఉండగా పురుషుల్లో 70.1 శాతం మంది ఉన్నారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే 2025 నాటికి జిడిపిలో 70 వేల కోట్ల డాలర్లు పెరుగుతుందని ఒక అంచనా. ఐఎల్‌ఓ నివేదిక ప్రకారం భారత్‌లో 52 శాతం మంది మహిళలు వేతన ఉపాధి లేదా కుటుంబ సంరక్షణలో ఉంటామని చెప్పారు. కానీ 2005లో 32 శాతంగా ఉన్న మహిళా శ్రామిక శక్తి 2021 నాటికి 19.2 శాతం తగ్గింది. ప్రముఖ మీడియా సంస్థ అల్ జజీరా 2023 ఏప్రిల్‌లో పదిన ఒక విశ్లేషణ ప్రచురించబడింది. "జనాభాలో భారత్ దూసుకుపోతున్నా శ్రామిక శక్తిలో తగ్గుతున్న మహిళలు" అని పేరు పెట్టింది. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్న భారత్ మహిళా శ్రామిక శక్తిలో ప్రపంచంలోని అతి తక్కువ 20 దేశాల్లో ఒకటిగా ఉందని, గత కొద్ది సంవత్సరాలుగా తగ్గుతున్నట్లు గుర్తించబడింది. పెరుగుతున్న జనాభాకు ప్రత్యేకించి మహిళలకు ఉపాధిని చూపడంలో విఫలమైతే భారత్‌కు అది గుదిబండగా మారుతుంది. అధికారికంగా గుర్తించినపుడు 200లో 35 శాతం మంది మహిళలు ఉపాధి పొందారు 2022 నాటికి 25 శాతం తగ్గినట్లు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆర్థికవేత్త రోజా అబ్రహం చెప్పారు. సిఎంఐఇ ఉపాధి నిర్వచనం ప్రకారం 2022లో పని చేసే వయస్సులో ఉన్నవారిలో కేవలం పది శాతం మంది మాత్రమే అంటే 3.9 కోట్ల మంది మాత్రమే పని చేయడం లేదా పని కోసం చూస్తున్నవారున్నారని, అదే పురుషుల విషయానికి వస్తే 36.1 కోట్ల మంది కనిపిస్తారు. పని చేయగలిగిన వయస్సు వారి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి పెరగడం లేదని, గత దశాబ్దంలో మంచి ఉద్యోగాలు తగ్గినట్లు, తక్కువ వేతనాలతో పని చేయటం కంటే ఇల్లు, పిల్లలను చూసుకోవటం మరింత లాభదాయకమని వారి కుటుంబాలు ఉన్నాయని సిఎంఐ డైరెక్టర్ మహేష్ వ్యాస్ చెప్పిన మాటలను ఉటంకించింది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పది శాతం పెరిగితే జిడిపి 552 బిలియన్ల విలువతో పాటు 2018లో మెకెన్సీ నివేదిక పెరుగుతోంది. చిత్రం మహిళలకు అన్ని గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం, మరుగుదొడ్లు కట్టించాం అని ఊరూ వాడ ప్రచారం చేసే బిజెపి ప్రచారం తమ రెండింజన్ల డ్రైవర్లు సాధించిందేమిటో, పదేళ్లలో పరిస్థితి ఎందుకు దిగజారిందో ఎక్కడా మాట్లాడటం లేదు. గోడీ మీడియా సంగతి సరేసరి. తేలు కుట్టిన దొంగల్లా నోరెత్తటం లేదు. ఈ విషయాన్ని పట్టించుకోవాల్సింది కాదన్నట్లుగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజారిటీని కోల్పోవటానికి మహిళా ఉపాధి తగ్గటం కూడా ఒక కారణమే.

# చంద్రబాబు క్యాబినెట్ నిర్ణయాలు ఇవే



అమరావతి : మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, ఏప్రిల్ నుంచి పింఛను రూ.4వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన అంశాలకు చంద్రబాబు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్తగా టెట్ నిర్వహణ, టెట్ లేకుండా డీఎస్సీ నిర్వహణ ప్రతిపాదనలపై చర్చించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం . దాదాపు మూడున్నర గంటల పాటు కొనసాగింది.. ఈ భేటీలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చేసిన ఐదు సంతకాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డీఎస్సీ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు క్యాబినెట్ ముందుంచారు. జులై ఒకటి నుంచి ప్రక్రియను ప్రారంభించి డిసెంబర్ 10లోపు 16,347 పోస్టులను భర్తీ చేసేలా ప్రణాళికను రూపొందించారు. దీనికి ఆమోదం తెలిపింది కేబినేట్ .అలాగే పింఛన్ల పెంపు అంశంపైనా మంత్రివర్గంలో కీలకంగా చర్చించారు. దీని కింద ఇచ్చే మొత్తం రూ.3వేల నుంచి రూ.4లకు పెంచే నిర్ణయానికి ఆమోదం తెలిపారు. జులై 1 నుంచి పెంచిన పింఛన్లను ఇంటి వద్దే అందజేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత మూడునెలలకు కలిపి వచ్చే నెలలో ఒక్కొక్కరికి రూ.7వేల పింఛను అందనుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది లబ్ధిదారులకు ఈ మొత్తాలను పంపిణీ చేయనున్నారు.

వైద్య ఆరోగ్య వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణకు ఆమోదం

వైద్య ఆరోగ్య వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గంజాయి నివారణకు హోంమంత్రి అనిత సారథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హోం, రెవెన్యూ, హెల్త్, గిరిజన శాఖ మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు చేయనున్నారు. గంజాయి నియంత్రణపై మంత్రుల కమిటీలో సభ్యుడిగా మంత్రి నారా లోకేశ్ ఉండనున్నారు. 6 శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేయాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం, మద్యం, ఆర్థిక అంశాలతో పాటు శాంతిభద్రతల అంశంపైనా శ్వేతపత్రాలు విడుదల చేయాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీ అనంతరం రాజకీయ అంశాలపై మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు.

మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీకి మంత్రివర్గ ఆమోదం

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుకు మంత్రివర్గ ఆమోదం

ఏప్రిల్ నుంచి వర్తించేలా రూ.4 వేల పెన్షన్ పెంపునకు క్యాబినెట్ ఆమోదం%ౌ

పెండింగ్ బకాయిలు కలిపి జులై 1న ఇంటివద్దే రూ.7 వేల పెన్షన్ ఇవ్వాలని నిర్ణయం-అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన అంశాలకు మంత్రివర్గ ఆమోదం

రాష్ట్రంలో గంజాయి కట్టడికి హోంమంత్రి నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యుడిగా నారా లోకేశ్

7 అంశాలపై శ్వేత పత్రాల విడుదలకు మంత్రివర్గ నిర్ణయం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, లా అండ్ ఆర్డర్, పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం, మద్యం అంశాలపై శ్వేతపత్రాల విడుదల

వైద్య ఆరోగ్య యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ

పెన్షన్ల పథకానికి ఎన్టీఆర్ భరోసాగా పేరు మార్పు

## అధ్వాన్నంగా గ్రామీణ రోడ్లు

కడప,గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇటీవల కాలంలో వేసిన నూతన తారురోడ్లు సైతం గతంలో కురిసిన వర్షం దెబ్బకు రాకపోకలకు మరింత ఇబ్బందికరంగా మారాయి. ప్రధానంగా రాయచోటి మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే దారులు అడ్డదిడ్డంగా మారాయి. రాయచోటి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల పరిధిలోని పలు గ్రామీణ రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట పరిధిలోని సుండుపల్లె,

# స్వర్ణముఖిలో చెక్‌డ్యామ్‌కు లభించని మోక్షం

అనంతపురం,స్వర్ణముఖి నదిలో నీరు లేకపోతే భూగర్భ జలాలు కూడా ఇంకిపోతున్నాయి. ఇందులో తలపెట్టిన చెక్‌డ్యామ్‌ల వల్ల నీరు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. తక్షణం వీటినిచేపట్టాలని కోరుతున్నారు. అయితే రెండు చోట్ల తలపెట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాలు ప్రతిపాదనలకే పరిమితమాయ్యాయి. అగళి మండలంలో స్వర్ణముఖి నది పరిసర ప్రాంతాలలోని బొమ్మరసనపల్లి, రాగేనింగనహళ్లిలతో పాటు మరో నాలుగు గ్రామాలలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. వెయ్యి అడుగులు తవ్వించినా చుక్కనీరు దొరకడం కష్టసాధ్యంగా మారింది. ఎటువంటి సాగునీటి వనరులు లేకపోవడంతో ఆ ప్రాంత రైతులు వర్షాధారిత పంటలపైనే ఆధారపడుతున్నారు. దశాబ్దకాలంగా సరైన వర్షాలు కురవకపోవడం, చెరువులు, కుంటలకు నీరు చేరకపోవడం, కురిసిన వర్షపు కూడా వృథా అవుతుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి ఉన్న బోరుబావులు ఎండిపోతున్నాయి. కర్ణాటక సరిహద్దులోని అగళి ప్రాంతంలో స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ప్రవహించిన కొద్ది రోజులు ఆ పరిసర ప్రాంతాలలో భూగర్భజలాలు పెంపొందుతాయి. మళ్లీ భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటిఎద్దడి తీవ్రరూపం దాల్చుతోంది. నది సమీపంలోని గ్రామాలలో కూడా తాగు, సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. అక్కడక్కడ ఉన్న తోటలు కూడా ఎండిపోతుండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొంతమంది రైతులు వేసవిలో తోటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి తడులు పెట్టుకున్నారు. స్వర్ణముఖి నదిలో సబ్‌సర్ఫేస్ చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు పరిశీలించారు. ఆ నదిలో రెండు చోట్ల ఈ చెక్‌డ్యాం నిర్మాణాలు చేపడితే ఒక్కొక్క చెక్‌డ్యాం పరిధిలో కిలోమీటరు వరకు భూగర్భజలాలు పెంపొందుకు అవకాశముంటుందని సంబంధిత శాఖ అధికారుల సమాచారం. ఇందుకు సంబంధించి గ్రౌండ్ వాట ర్ లెవల్ డిపార్టుమెంట్ అధికారులు కూడా పరిశీలించి చెక్‌డ్యాంల నిర్మాణానికి క్లియరెన్స్ ఇచ్చారు. దీంతో ఇరిగేషన్‌శాఖ వారు రెండు చోట్ల చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.2.30 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటి వరకు నిధులు మంజూ రు కాలేదు.

# అమాత్యులు అయ్యేదెవరో ?

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలతో సమావేశంతో పాటు కార్పొరేషన్ చైర్మన్ల సమావేశం ఖరారు, జూన్ 02వ తేదీన జరగనున్న మంత్రివర్గ విస్తరణ, పిసిసి ఎంపికకు సంబంధించి ఢిల్లీలో అధిష్టానంతో సిఎం రేవంత్ చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలిసింది. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో మొదటి రెండు రోజులు కొ త్తగా ఎంపికైన లోక్ సభ సభ్యుల ప్రమాణ స్వీకారం కొనసాగనుంది. ఈ వెబ్‌సైట్ సిఎం హాజరు కాగా కనిపిస్తుంది. ఈ సందర్భంగా ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం కానున్నారు. ఈ పర్యాటనలో భాగంగా ముఖ్యమంత్రి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్రాభివృద్ధిపై చర్చించి పలు సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో అటు పార్టీలో ఇటు మంత్రివర్గంలో పదవులు ఆశిస్తున్న ఆశావహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.జూలై 02వ తేదీన మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ ముహూర్తం పెట్టినట్లు తె లిసింది. ఆలోపు మరికొంతమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని సమాచారం.లోక్‌సభ ఎన్నికలు ముగిసిపోవడం అధిష్టానం సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో స్థాయి కేబినెట్ కూర్పుపై పిసిసి ఫోకస్ పెట్టినట్లు కాంగ్రెస్‌లో ప్రచారం. మంత్రి పదవులు దక్కించుకునేందుకు కాంగ్రెస్ పా ర్టీలోని పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రయత్నాలు చేస్తుండగా అధిష్టానం వారి పనితీరును బట్టే ప దవులు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై త్రీ మెన్ కమిటీ అధ్యయనం చేసి ఆ కమిటీ నివేదిక ప్రకారం ఆశావహుల భవిష్యత్ తేల్చబోతున్నారన్న మాట వినిపిస్తోంది. ఈ క్ర మంలో అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలోకి బిఆర్ఎస్ నుంచి వలసలు మొదలవడం సంచలన పరిణామంగా మా రింది. మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో మరికొంత మంది ఇతర పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారన్న ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. దీంతో మంత్రివర్గంలో చోటు దక్కేదెవరికి, నిరాశ మిగిలేదెవరికి అనేది ఆసక్తిగా మారుతోంది.సిఎం, డిప్యూటీ సిఎంతో పాటు 11 మందికి మంత్రివర్గంలో చోటు కల్పించారు. మరో ఆరుగురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉంది.ఇప్పటివరకు ప్రస్తుతం రంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా నేతలకు కేబినెట్‌లో ప్రాతినిథ్యం లేదు. ఈ ఉమ్మడి హైదరాబాద్ జిల్లాలో దానం నాగేందర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి అనూహ్యంగా కాంగ్రెస్ లో చేరికతో వీరికి మంత్రివర్గంలో చోటు దక్కుతుందా లేదా అనేది చర్చనీయాంశం అవుతోంది. అయితే చేరికల అంశం ఇలా ఉంటే మంత్రివర్గ కూర్పులో సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకొని మంత్రివర్గ విస్తరణను చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఎవరూ లేకపోవడంతో మంత్రి వర్గంలో ఆ వర్గానికి ప్రతినిధిగా ఎవరిని ఎంపిక చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అయితే మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఇద్దరు ఓసిలు, ఇద్దరు బిసిలు, ఒక మైనారిటీ, మరొకటి లంబాడీలకు దక్కే అవకాశం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారితో పాటు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు కూడా మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. ఇప్పటికే రాజ్యసభ సభ్యుడు కేకే, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తాజాగా పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరారు.త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉండబోతున్న కారణంతో మరికొంత మంది ఇతర పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, బాలు నాయక్, షబ్బీర్ అలీ, మల్ రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, ప్రేమ్‌సాగర్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంత్రి వర్గం పేర్లు వినిపిస్తున్నాయి. దీనితో ఇతర పార్టీల నుంచి వచ్చే వారిలో కేబినెట్‌లోకి ఎంట్రీ దక్కుతుందా లేదా అనే ది సస్పెన్స్‌గా మారింది. తాజాగా కాంగ్రెస్‌లోకి మొదలైన చేరికల పర్వంతో సొంత పార్టీలోని ఆశావహులతో పాటు రాజకీయ పార్టీలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ఈ మేరకు గతంలో 37 నామినేటెడ్ పోస్టు సిఎం రేవంత్ భర్తీ చేయగా అందులో చాలామందిని మార్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనితోపాటు మరిన్ని నామినేటెడ్ పోస్టులతో పాటు పలు డైరెక్టర్ పోస్టులను కూడా భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## భోజన కార్మికులకు బకాయిలు

అనంతపురం,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. అయితే పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీ నిర్వాహకులు నాలుగు నెలల నుంచి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులు ఆకలి తీరుస్తున్నామంటూ వాపోతున్నారు. అరకొరగా వచ్చే ఆదాయంతో ఏజెన్సీలు నిర్వహించలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

# అధిష్టానంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అలక



జగిత్యాల:జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం స్థానిక కాంగ్రెస్‌లో చిచ్చురేపింది. స్థానిక 'హస్తం' పార్టీ శ్రేణులు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయారు. పార్టీ సీనియన్ నేతనైన తనకు కనీసం తన ప్రత్యర్థిని పార్టీలో చేర్చుకునే విషయం కూడా చెప్పరా? అంటూ ఆగ్రహానికి గురయ్యారు. అలకబూనిన ఆయన పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఏకంగా బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం వరకూ వెళ్లింది. దీంతో పార్టీ సీనియర్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు సహా ప్రభుత్వ విప్‌లు లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేశారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడనున్నట్టు తెలిసింది. ఏదేమైనా తన 40ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో వన్‌మ్యాన్ ఆర్మీగా ఉన్న జీవన్‌రెడ్డి ఎపిసోడ్ ఎటు మలుపు తిరుగుతుందోనన్న చర్చ సర్వత్రా నెలకొంది. తొలి నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్న జీవన్‌రెడ్డి 1983 నుంచి జగిత్యాలలో ఓటమెరుగని నేతగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మధ్యలో 1985, 1994, 2009, 2018 ఎన్నికల్లో మాత్రమే ఓటమి చవిచూశారు. అయినప్పటికీ 2018 ఓటమి తరువాత వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రస్తుతం శాసనమండలి సభ్యునిగా కొసాగుతున్నారు. అయితే ఈయనకు తొలి నుంచి టీడీపీ పోటీగా నిలబడగా.. తరువాత 2014 నుంచి బీఆర్ఎస్ ప్రత్యర్థిగా ఉంటూ వచ్చింది. 2014లో గెలిచినప్పటికీ 2018లో బీఆర్ఎస్ చేతిలో ఓటమి తప్పలేదు. ప్రధాన ప్రత్యర్థి పార్టీగా బీఆర్ఎస్‌కు ఆయనే గట్టిపోటీనిస్తూ కాంగ్రెస్ క్యాడర్‌ను, పార్టీని కాపాడుకుంటూ వస్తున్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లోనూ తన అసెంబ్లీ సెగ్మెంట్ భాగమైన నిజామాబాద్ లోక్‌సభకు పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ తొలి నుంచి జగిత్యాల అంటేనే జీవన్‌రెడ్డి అన్న రీతిలో తన చరిష్మాను చాటుకుంటూ వస్తున్న ఆయనకు.. తన సెగ్మెంట్‌లో తనపై పోటీ చేసి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ని కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్న విషయం కనీస సమాచారం లేకుండా పోయింది. దీంతో జీవన్ రెడ్డి పార్టీ అధినాయకత్వంపై అలకబూనడం, ఆగ్రహం వ్యక్తం చేయడం వంటి పరిణామాలు తెలిసిందే.

### పార్టీకి రాజీనామా.. బీజేపీలో చేరుతారనే ప్రచారం

ఇన్నాళ్లూ పార్టీ కోసం అహర్నిశలూ కష్టపడ్డ తనకు ప్రత్యర్థిగా ఉన్న ఎమ్మెల్యే సంజయ్ ని కాంగ్రెస్‌లో చేర్చుకునే విషయాన్ని చెప్పకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తికి గురైన జీవన్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తారనే ప్రచారం నడిచింది. అందులోనూ సంజరు చేరికకు ముందు రోజే పార్టీ ఫిరాయింపులపై జీవన్‌రెడ్డి పలు వ్యాఖ్యలు చేశారు. 'ఏ రాజకీయ పార్టీ అయినా సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది.రాష్ట్రంలో 65 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంది. ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవాల్సిన అవసరం ఉందని తాను భావించడం లేదు. ఇలాంటి వాటిని నేను వ్యక్తిగతంగా ప్రోత్సహించను' అంటూ మాట్లాడారు. ఆ మర్నాడు ఆదివారం సాయంత్రమే తన ప్రత్యర్థిగా ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజరుని సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. ఆ ఫొటోలు, వార్తలు వచ్చేవరకూ జవన్‌రెడ్డికి సమాచారం లేని అనూహ్య పరిణామంతో ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తన అనుచరుల ఫోన్లూ ఎత్తకుండా అలకబూని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సంజరు చేరికపై ఆయన అభిప్రాయం తెలుసుకునేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులకూ అందుబాటులోకి రాలేదు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ పదవికి జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్టు వార్తలు గుప్పుమన్నాయి. కాగా, బీజేపీలో చేరుతున్నారంటూ ప్రచారం మొదలైంది. అందుకు జీవన్‌రెడ్డిని కరీంనగర్, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీలు బండి సంజరు, ఈటల రాజేందర్ కలుస్తారని వార్తలు షికారు చేశాయి. జీవన్‌రెడ్డిని బీజేపీలోకి ఆహ్వానించే అవకాశం ఉందని జోరుగా చర్చలు మొదలయ్యాయి. ఈ వార్తలపై జీవన్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించకపోవడం అందుకు బలం చేకూర్చింది.

### బుజ్జగించే పనిలో సీనియర్ నేతలు

ప్రభుత్వ విప్‌లు.. ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ సోమవారం ఉదయమే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేసే క్రమంలో అప్పటికే కాంగ్రెస్ శ్రేణులు, జీవన్‌రెడ్డి క్యాడర్ పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. సంజయ్ చేరికను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. పరిస్థితి చేజారుతుందనగా.. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సైతం సాయంత్రం జీవన్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఆయననూ పార్టీ క్యాడర్ అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ ఆయన జీవన్‌రెడ్డితో మాట్లాడే ప్రయత్నం చేశారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఫోన్‌లో జీవన్‌రెడ్డితో మాట్లాడనున్నట్టు తెలిసింది. ఏదేమైనా ఈ ఎపిసోడ్ మొత్తంలో జీవన్‌రెడ్డి అలకవీడుతారా? లేక పార్టీ మారుతారా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. మరోవైపు తల్లిలాంటి పార్టీని మోసం చేశారంటూ ఎమ్మెల్యే సంజరుపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆయన దిష్టిబొమ్మలు దహనం చేశారు.

# టీడీపీ కూటమిలో ఎమ్మెల్యే లకు ఫండ్స్ ఉంటాయా ?

అమరావతి,ప్రతీ నియోజకవర్గంలో అభివృద్ధి చేసుకునేందుకు ఎమ్మెల్యేలకు ఫండ్స్ అని గత ప్రభుత్వాలు తీసుకుని వచ్చాయి. దాని వల్ల ఎమ్మెల్యే తన నియోజకవర్గాల పరిధిలో ఏదైన అభివృద్ధి కార్యక్రమాలు చేసుకునే వెసులుబాటు ఉండేది. అలా ఎమ్మెల్యేలకు విలువ గౌరవం ఉండేది. అంతే కాదు వారు తాము చేసినవి జనాలకు చెప్పుకునేందుకు వీలు ఉండేది.కానీ జగన్ ప్రభుత్వంలో అలాంటిది ఏమీ లేదని ఎమ్మెల్యేలు చాలా బాధపడిన సందర్భాలు ఉన్నాయి. దాని మీద ప్రతిపాదనలు పెట్టినా కూడా అమలు కాలేదు. చేద్దాం చూద్దామని కాలం గడిపేశారు. మొత్తం అంతా సెంట్రలైజేషన్ అయిపోయింది. సంక్షేమానికి ప్రభుత్వమే ఖర్చు చేస్తోంది కాబట్టి వేరేగా ఇవ్వాల్సింది లేదు అన్నది గత ప్రభుత్వ ఆలోచనగా ఉండవచ్చు అని అంటున్నారు.ఏది ఏమైనా ఎమ్మెల్యేలు అయితే ఉత్సవ విగ్రహాల మాదిరిగానే మారిపోయారు. కోట్లు ఖర్చు చేసి గెలిచి వచ్చిన ఎమ్మెల్యే తన అధికారాన్ని ఉపయోగించి ఒక పైసా కూడా ఖర్చు చేసే పరిస్థితి అయితే లేదు. ఇది కూడా వైసీపీలో అసంతృప్తి పెంచేలా చేసింది. జనాలకు ఎమ్మెల్యేలు గుర్తు లేకుండానూ చేసింది.మరి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. బంపర్ మెజారిటీతో జనాలు గెలిపించారు. ఈ ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు ప్రజలు పెట్టుకున్నారు. అలాగ్గే భారీ ఆధిక్యతతో గెలిచి వచ్చిన ఎమ్మెల్యేలు కూడా పెట్టుకున్నారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా వైసీపీ కంటే సంక్షేమ పథకాల విషయంలో రెట్టింపు హామీలు ఇచ్చి మరీ అధికారంలోకి వచ్చింది.దాంతో గతానికి కంటే పెద్ద ఎత్తున నిధులు వెల్ఫేర్ స్కీమ్స్ కి ఖర్చు చేయాల్సి రావడం ఖజానాకు పెను భారం అని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలకు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ ఎక్కడ నుంచి వస్తాయన్న ప్రశ్నలు వస్తున్నాయి. జగన్ ప్రభుత్వంలో అయితే ఒక వీధి లైట్ పోయినా దానికి డబ్బులు ఇవ్వాల్సిన అవకాశం అయితే అసలు లేదు. ఎందుకంటే వారికి అలాంటి పరిస్థితి ఉంది.జగన్ ప్రభుత్వం మొత్తం నిధులను సంక్షేమం కోసం ఖర్చు చేసింది. దానికే కేటాయించింది. చంద్రబాబు విషయానికి వస్తే ఆయన అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ గా పేరు తెచ్చుకున్నారు. దాంతో ఏపీలో అభివృద్ధి బాబు ప్రభుత్వం చేస్తుంది అన్నది తెలుసు. ప్రజలు కూడా అలాగే విశ్వసిస్తారు. మరి ఏపీలో ప్రభుత్వ స్థాయిలో అభివృద్ధి జరుగుతుంది



వేరేగా ఎమ్మెల్యేలకు స్పెషల్ గా డెవలప్మెంట్ ఫండ్స్ ఇస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది.అయితే అభివృద్ధికి పెద్ద పీట వేసే చంద్రబాబు నియోజకవర్గాల స్థాయిలో కూడా ఎమ్మెల్యేలకు నిధులు ఇస్తారని ఆశించేవారే కూటమిలో ఎక్కువ మంది ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేలు అంతా చంద్రబాబు తమకు నిధులు ఇచ్చే విషయంలో సీరియస్ గా ఆలోచిస్తారు అని నమ్ముతున్నారు.అయితే ఏపీలో ఆర్థిక పరిస్థితి చూస్తే ఇబ్బందిగానే ఉంది అని అంటున్నారు. దాంతో పాటు అనేక హామీలు ఇచ్చి మరీ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రయార్టీ ఇవ్వాల్సి వస్తే వాటికే ఎక్కువగా ఇవ్వాల్సి ఉంటుంది. దాంతో ఒకవేళ ఎమ్మెల్యేలు అడిగినా చంద్రబాబు మనసులో ఇవ్వాలని ఉన్నా కొన్నాళ్ళ పాటు ఆగాల్సి ఉంటుందని అంటున్నారు.కనీసంగా రెండేళ్ల పాటు అయినా ఆగితే ఏపీ ఒక గాడిన పడితే తప్పకుండా అపుడు చంద్రబాబు నుంచి ఆశించవచ్చు అని అంటున్నారు. ఇక ఎన్నికలకు రెండేళ్ల ముందు ఎమ్మెల్యేలకు నిధులు ఇస్తే వారి స్థానికంగా పనులు చేసుకోగలుగుతారు అన్న ఆలోచనలు కూడా ఉన్నాయి. మొత్తానికి ఎమ్మెల్యేలకు ఫండ్స్ అన్న దానికి మరో మారు చర్చకు తెర లేచింది. దాని మీద కూటమిలో మూడు పార్టీల ఎమ్మెల్యేలు ఆశతో వెయిట్ చేస్తున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. బాబు ప్రభుత్వం ఈ విధంగా డెసిషన్ తీసుకుంటుందో.

# ఐఏఎస్ బదిలీల్లో రేర్ సీన్.. రేవంత్ వ్యూహామేంటి?

హైదరాబాద్,పాలనను ప్రక్షాళన చేసేందుకు వీలుగా ఒకేసారి 40 మంది ఐఏఎస్ లు.. ఇద్దరు ఐపీఎస్ లు.. ఒక ఐఎఫ్ఎస్ .. మరో నాన్ క్యాడర్ అధికారిని బదిలీ చేయటం తెలిసిందే. తాజాగా చేసిన బదిలీల మొత్తంలో ఒక ఆసక్తికర అంశం చోటు చేసుకుంది. సమకాలీన రాజకీయాల్లో ఇలాంటి సీన్ చూసి ఉండమన్న మాట రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అదేమంటే.. కేసీఆర్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా వ్యవహరించిన హరీశ్ రావు వద్ద ఓఎస్ డీగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి అశోక్ రెడ్డి ప్రస్తుతం ఉద్యానవన శాఖ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు.ఆయన్ను తీసుకెళ్లి కీలకమైన వాటర్ బోర్డు ఎండీగా బాధ్యతలు అప్పజెప్పారు. ఇప్పుడున్న రాజకీయ వాతావరణంలో ఒక ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వారిని అప్రాధాన్యత పోస్టులకు పరిమితం చేయటం చూస్తుంటాం. అందుకు భిన్నంగా హరీశ్ రావుకు ఓఎస్డీగా వ్యవహరించిన అధికారిని తీసుకొని.. ప్రభుత్వంలో కీలకమైన వాటర్ బోర్డుకు ఎండీగా బాధ్యతల్ని అప్పగించటం చాలామందిని విస్మయానికి గురి చేసింది.ఇలాంటి ప్రయోగాలు చేయటం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను స్టీరియో టైప్ రాజకీయాలకు పరిమితం కాదన్న విషయాన్ని ప్రూవ్ చేసినట్లుగా చెబుతున్నారు. హరీశ్ రావుకు అత్యంత ముఖ్య అధికారిగా వ్యవహరించినప్పటికీ.. పని విషయంలోనూ.. సమర్థత విషయంలోనూ అశోక్ రెడ్డిని వంక పెట్టలేమని చెబుతున్నారు. ముక్కుసూటిగా పని చేసుకుంటూ పోయే ఆయనపై ఆరోపణలు కూడా పెద్దగా వినిపించవు. మంచిగా పని చేస్తారన్న పేరున్న ఆయనకు.. సమర్థత.. సామర్థ్యానికి తగ్గట్లుగా పోస్టు ఇవ్వటం చూసిన వైనం ఆసక్తికరంగా మారింది.గత ప్రభుత్వంలో కీలక నేతలకు సన్నిహితంగా ఉండే అధికారులపై వేటు వేయటం.. అప్రాధాన్యత



పోస్టులకు పరిమితం చేయటం లాంటివి చేయకుండా.. వారి టాలెంట్ ను ప్రభుత్వ రథాన్ని ముందుకు తీసుకెళ్లటంలో ఉపయోగించుకుంటామన్న సంకేతం తాజా బదిలీతో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చారన్న మాట వినిపిస్తోంది. మొత్తంగా ఇదో రేర్ సీన్ గా అభివర్ణిస్తున్న వారు లేకపోలేదు.ఇప్పటి రాజకీయ వాతావరణంలో ఈ తరహా నిర్ణయం ఆసక్తికర చర్చకు తెర తీసింది. ఇతర బదిలీల్లో కీలక అంశాల్ని చూస్తే.. సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియాకు ప్రభుత్వం భారీ ప్రాధాన్యతను ఇచ్చింది. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న ఆయనకే ప్లానింగ్.. పంచాయితీరాజ్.. గ్రామీణాభివృద్ధి శాఖలు అప్పజెప్పింది. హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ జాయింట్ కమిషన్ గా వ్యవహరిస్తున్న అమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్ గా పూర్తి అదనపు బాధ్యతల్ని అప్పజెప్పింది. ఇప్పటికే ఆమె ఐదు కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు.

# ఏపీ కాంగ్రెస్ ఏం నేర్వాలి?!



అమరావతి,ఏపీ వంటి రాష్ట్రంలో ఒకప్పుడు కాంగ్రెస్ అంటే.. ఆరాధ్య పార్టీ. ఇంటికొక ఓటు ఖాయం అని చెప్పుకొన్న రోజులు ఉన్నాయి. ఇంట్లో ముగ్గురు ఉన్నా.. నలుగురు ఉన్నా.. అంత మందీ ఓటేసినా..వేయకపోయినా.. ఒక ఓటు ఖాయం.. అని నాయకులు నిఖార్సుగా నమ్మి పార్టీని నడిపించిన రోజుల నుంచి విభజన తర్వాత .. పార్టీ కునారిల్లిపోయింది. ఎక్కడికక్కడ నాయకులు వీగిపోయారు. ఎవరి దారి వారు చూసుకున్నారు. కారణం.. నాడు రాష్ట్ర విభజన సమయంలో నెత్తీ నోరూ మొత్తుకున్నా.. ఏపీ నేతల మాటలను కాంగ్రెస్ పట్టించుకోలేదు.లగడపాటి రాజగోపాల్ వంటి వారు సమైక్య రాష్ట్రం కోసం ఉద్యమిస్తే.. కావూరి సాంబశివరావు, రాయపాటి సాంబశివరావు, ఉండవల్లి అరుణ్‌కుమార్ వంటి దిగ్గజ నాయకులు.. విభజన చేస్తే చేశారు. సక్రమంగా చేయండి.. ఏపీ హక్కులు కాపాడేలా చేయండి. నిఖార్సుగ చేయండి. తలుపులు మూసి చేయకండి అని నెత్తీనోరూ బాదుకున్నారు. కానీ, వీరి మాటలు ఆనాడు కాంగ్రెస్ వినిపించుకోలేదు. ఫలితంగా 10 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అవసాన దశలోనే కునారిల్లుతున్న దుస్థితి కళ్ల ముందు కనిపిస్తోంది.కట్ చేస్తే.. ఇప్పుడైనా పార్టీ అధిష్టానంలో మార్పు కనిపించిందా? అంటే లేదు. తాము చెప్పినట్టు వినాల్సిందే.. తాము చెప్పింది చేయాల్సిందే.. అన్నట్టుగా వ్యవహరిస్తోంది. తాజాగా సార్వత్రిక ఎన్నికలకు ముందు.. వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డ.. అనే ఒకే ఒక్క అర్హతతో వైఎస్ షర్మిలను తీసుకువచ్చిన పార్టీ పగ్గాలు ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రచారం చేశారు. కొంత దూకుడుగా నే వెళ్లారు. దీనిని ఎవరూ కాదనరు. కానీ, ఇక్కడ పార్టీకి వచ్చిన మేలేంటి? ఒరిగిన ఓట్లేంటి? అనేదే బిగ్ క్వశ్చన్.ఎందుకంటే.. కాంగ్రెస్‌కు కావాల్సింది.. జగన్‌ను తిట్టడం కాదు. కాంగ్రెస్‌కు కావాల్సింది.. కొన్ని పార్టీలతో అంతర్గత లాలూచీలు కూడా.. కావు. ఏకపక్ష నిర్ణయాలు.. ఏకపక్ష వ్యవహారాలు అసలే కాదు. పైగా.. పడిపోయిన చోట నుంచి నిలబడాలని అనుకున్నప్పుడు.. నాయకుల ఊతం అత్యంత ముఖ్యం ఈ విషయంలోనే షర్మిల విఫలమయ్యారు. దీనినే కొందరు నాయకులు ప్రశ్నించారు. షర్మిల వల్లే పార్టీకి అన్యాయం జరిగిందన్నారు తప్ప.. తమకు అన్యాయం జరిగిందని చెప్పలేదు.కానీ, ప్రశ్నించిన వారికే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ సంజాయిషీ నోటీసులు ఇచ్చింది. వాస్తవం ఏంటో తెలుసుకోకుండానే.. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా.. ఇక్కడ కూడా.. గతంలో మాదిరిగానే వ్యవహరించిన తీరు పక్కాగా కళ్లకు కడుతోంది. పోయేదేమీలేదు.. అని అనుకుని నేతలు.. బయటకువస్తే.. కాంగ్రెస్ జెండో మోసే దిక్కులేదు. చిత్రం ఏంటంటే.. ఏపీలో పార్టీలు బోలెడు. చేరుతామంటే.. చేర్చుకునే అధినేతలు కూడా బోలెడు మంది. నష్టం.. కష్టం ఏమైనా ఉంటే అది కాంగ్రెస్‌కే!!

# మణిపూర్ లో రెండు భిన్న డిమాండ్లు.. మోడీ నిర్ణయం ఎటు?



న్యూఢిల్లీ,మణిపూర్ రాష్ట్రంలో గతంలో జరిగిన అల్లర్లు, అరాచకాలు, దారుణాలు, ఘోరాల గురించి తెలిసిందే. ఈ విషయం దేశవ్యాప్తంగానే కాకుండా.. ప్రపంచ వ్యాప్తంగానూ చర్చనీయాంశం అయిన పరిస్థితి. ఆ ఘోరాల తాలూకు నీడలు, గుర్తులు, మరకలు ఇంకా స్పష్టంగా ఉన్నాయని చెబుతుంటారు. ఈ నేపథ్యంలో తాజాగా కుకీ జో తెగ సంఘాలు మణిపూర్ లో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు చేపట్టాయి.అవును... మణిపూర్ లోని కొండప్రాంతాలతో కూడిన పలు జిల్లాల్లో కుకీ జో తెగ సంఘాలు తాజాగా పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు చేపట్టాయి. .ఈ సందర్భంగా... మణిపూర్ లో తెగల మధ్య చోటు చేసుకుంటున్న ఘర్షణలకు ముగింపు పలకాలని.. ఇదే సమయంలో తమ ప్రాంతాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేయాలని ఆ తెగ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ విషయాలపై ప్రధాని స్పందించాలని కోరుతున్నారు.ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 239ఏ ప్రకారం తమకు అసెంబ్లీతో కూడిన కేంద్రపాలిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని కుకీ తెగ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో తమ డిమాండ్ ల పరిష్కారాలను వేగవంతం చేయాలని కోరుతూ... కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కు మెమరాండం సమర్పించినట్లు కుకీ జో తెగ సంఘాల జిల్లా అధికారులు చెబుతున్నారు.వీరి సంగతి అలా ఉంటే... మరోపక్క వీరికి వ్యతిరేకంగా ఇంఫాల్ వ్యాలీలో మైతేయి తెగకు సంబంధించిన మహిళా సంఘాలు ర్యాలీలు నిర్వహించాయి! ఇందులో భాగంగా... కేంద్ర ప్రభుత్వం కుకీ మిలిటెంట్లకు మద్దతుగా ఉండొద్దని.. "ప్రత్యేక పరిపాలనా వద్దు.. గ్రామ వాలంటీర్లను అరెస్ట్ చేయొద్దు" అనే నినాదాలతో ర్యాలీ చేశారు. దీంతో.. ఈ విషయంపై ప్రధాని ఎలా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది.కాగా... గత ఏడాది మే నుంచి మణిపూర్ లోని వ్యాలీ ప్రాంతాల్లో నివసించే మైతేయి తెగకు.. పర్వత ప్రాంతాల్లో ఉండే కుకీ జో తెగకు మధ్య తీవ్రస్థాయిలో అల్లర్లు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ అల్లర్లు హింసాత్మక ఘటనలుగా మారడంతో సుమారు 220 మంది మృతి చెందరు.. వేలాది మంది గాయపడ్డారు.. చాలా మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు!

## వలంటీర్లకు ఇచ్చే పత్రికా అలవెన్స్ రద్దు

అమరావతి,రాష్ట్రంలో గ్రామ, వార్డు వాలంటీర్లకు దినపత్రిక కొనుగోలు కోసం గతంలో ఇచ్చే అలవెన్సును ఏపీ ప్రభుత్వం రద్దు చేసింది. న్యూస్ పేపర్ అలవెన్సు కోసం ఎలాంటి చెల్లింపులు జరపవద్దని ఆదేశాలు జారీ చేసింది. గత ప్రభుత్వం అడ్డదారుల్లో తమ సొంత పత్రిక సర్క్యులేషన్ పెంచుకొనేలా.. వాలంటీర్లు పత్రిక వేయించుకోవాలంటూ రూ.200 చొప్పున చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సొంత పత్రికకు ప్రభుత్వ నిధులు దోచిపెట్టేందుకు జగన్ ఆ జీవోలు ఇచ్చారంటూ అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

# రహదారుల అభివృద్ధికి సహకరించండి

న్యూఢిల్లీ,రోడ్లు, రహదారుల అభివృద్ధి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన 'భారత్ మాల' స్థానంలో కొత్త విధానం రాబోతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జాతీయ రహదారుల అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించినట్లు చెప్పారు. హైదరాబాద్–విజయవాడ హైవేను 6 లైన్ల రహదారిగా మార్చాలని కోరాం. ఉప్పల్–ఘట్‌కేసర్ మధ్య రహదారి 40 శాతమే పూర్తయింది. ఈ విషయం మంత్రి వద్ద ప్రస్తావించగా.. రహదారి పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్–ఘట్‌కేసర్ ఫ్లై ఓవర్ టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని గడ్కరీ ఆదేశించారు. మంగళవారం కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, భూపేంద్ర యాదవ్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరాం అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. తెలంగాణలో ఓటు షేర్ పెంచుకున్నాని సుస్థిర పాలన అందిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. 2018 నుంచి రీజనల్ రింగ్ రోడ్ పై చర్చ జరుగుతుంది కానీ ముందుకు కదలడం లేదని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక రీజనల్ రింగ్ రోడ్ ఎన్నికల కోడ్ వల్ల ఆలస్యం అయ్యిందని తెలిపారు. హైదరాబాద్ విజయవాడ రహదారిని 6 లైన్ల రహదారిగా మార్చాలని రోజుకి 60 వేల వాహనాలు తిరుగుతాయని చెప్పారు. 17 ప్రమాద జోన్లను గుర్తించామని తెలిపారు. త్వరగా హైదరాబాద్ – విజయవాడ రహదారిని 6 లైన్ల రహదారి పనులు చేపట్టాలని కోరామని అన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు కోసం ప్రత్యేక సమావేశం పెడతామని చెప్పారని తెలిపారు. 16 రోడ్లు పెండింగ్ లో ఉన్నాయని నూతన జాతీయ రహదారుల కోసం మరో సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారని అన్నారు. ఉప్పల్ – ఘాట్ కేసర్ ఫ్లయ్ ఓవర్ టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని అధికారులకు నితిన్ గడ్కరీ ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రేపు కిషన్ రెడ్డిని కలుస్తానని తెలిపారు. వచ్చే మూడేళ్లలో రీజనల్ రింగ్ రోడ్డు, విజయవాడ – హైదరాబాద్ 6 లైన్ల రహదారిని పూర్తి చేస్తామని చెప్పారు. ఇకపోతే తెలంగాణలో ఓటు షేర్ పెంచుకున్నాం.. సుస్థిర పాలన అందిస్తున్నామని అన్నారు. హైదరాబాద్ విజయవాడ రహదారిని 6 లైన్ల రహదారిగా మార్చాలన్నారు.రోజుకూ 60 వేల వాహనాలు తిరుగుతాయని, 370 చోట్ల ప్రమాద జోన్లను గుర్తించినట్లు తెలిపారు.తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ను మర్యాద పూర్వకంగా కలుస్తామని, రేపు కిషన్ రెడ్డిని కలుస్తామని



తెలిపారు. భుపెంద్ర యాదవ్‌తో అటవీ పర్యావరణ అనుమతుల గురించి చర్చిస్తామన్నారు. తెలంగాణ ఎంపీల ప్రమాణస్వీకారానికి హాజరవుతునట్లు తెలిపారు. తాను అభిపవృద్ధి పనుల కోసం వచ్చానని స్పష్టం చేశారు. నేషనల్ హైవే నిధులు ఎక్కువగా తెలంగాణకు ఇవ్వాలని కోరామన్నారు.

## ఐదేళ్లలో వ్యవస్థలు సర్వనాశనం

అమరావతి,గడిచిన ఐదేళ్లలో వ్యవస్థలను, కార్పొరేషన్లను సర్వనాశనం చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ అన్నారు. వైసీపీ తొత్తులకు ఉద్యోగాల కోసం ఏకంగా కార్పొరేషన్ పెట్టి దోచిపెట్టారని మండిపడ్డారు. కంటెంట్ కార్పొరేషన్ గా ఉన్నదాన్ని ఏపీ డిజిటల్ కార్పొరేషన్ పేరు మార్చి దోచుకున్నారని ధ్వజమెత్తారు. ఒక చిన్న కార్పొరేషన్ లో 129 మంది ఉద్యోగులను తీసుకొని లక్షల్లో జీతాలు చెల్లించారని ఆరోపించారు. సగంమంది ఆఫీసుకు రాకుండా జీతాలు చెల్లించారని చెప్పారు. చైర్మన్, వైస్ చైర్మన్ల ఇళ్లలో ట్యూషన్ చెబుతున్న టీచర్లకు కార్పొరేషన్ నుంచి జీతాలు చెల్లించారన్నారు. ప్రకటనల పేరుతో సాక్షి పేపర్‌కు,ఐ ప్యాక్‌కు కోట్లు కట్టబెట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఐడ్రీమ్ యూట్యూబ్ ఛానల్ నిర్వహకుడికి డిజిటల్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి కొన్ని వేల కోట్లు దోచిపెట్టారని ఆరోపణలు చేశారు. దోపిడీపై ప్రశ్నించిన తనకు నోటిసులు ఇచ్చిన చిన్న వాసుదేవరెడ్డి నేడు ఎక్కడికి పారిపోయారని విమర్శలు గుప్పించారు. ఈ అక్రమ దోపిడీపై చంద్రబాబు ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విజయ్ కుమార్ కోరారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com